# తెలుగులో - పదకవిత

( పరిషత్తు రజతోత్సవ సందర్భమున జరిగిన ఉపన్యాసముల సంకలనము )

ACC NO 10989

ప్రకాశకులు :

ఆంధ్ర సారస్వత పరిషత్తు

హైదరాబాదు.

1973

ప్రథమ ముద్రణ 1973
ప్రతులు 2000

8135
ACC No- 10989

వెల రు. 2-00

ముద్రణ :
శివాజీ ప్రెస్,
సికింద్రాబాదు.

# తొలి పలుకులు

ఆంధ్రమహా గ్రంథములను గూర్చి ప్రసిద్ధ పండితులచే ఉపన్యాసము లిప్పించుట, వానిని పుస్తకరూపమున ప్రకటించుట, ఆంధ్ర సారస్వత పరిషత్తునకు పరిపాటిగా వచ్చు చున్నది. అట్లు వెలువడినవే 'ఆంధ్ర మహాభారతోపన్యాసములు' ఆంధ్ర మహాభాగవతో పన్యాసములు' అను గ్రంథములు. అట్లే ఈ రజతోత్సవ శుభ సమారంభమున 'తెలుగులో పదకవిత' అను అపూర్వ విషయముపై సంగీత సాహిత్యములలో నిష్ణాతులైన పండితుల నాహ్వానించి వారిచే ప్రసంగములు చేయించి గ్రంథరూపమున ప్రకటించు చున్నది.

ఆంధ్ర సారస్వత మహాస్రవంతి దేశి-మార్గి అను రెండుపాయలుగా పారి తెలుగు వారి మానస కేదారములలో ఆనందమును పండించినది. ఈ విధమైన దేశికవితలో ప్రధానమైన పదకవితా శాఖను గూర్చి ప్రత్యేక కృషిజరుగలేదు. ఆదృష్టితో నీప్రయ త్నము చేయబడినది. ఇందు పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమయ్య, రాగము నకురససిద్ధినిగూర్చిన క్షేత్రయ్య, సంకీర్తనా చార్యుడు త్యాగరాజు, ప్రసిద్ధ వాగ్గేయ కారుడు గోపన్నలను గూర్చిన నాలుగు ప్రసంగములు సంకలితము చేయబడినవి.

సంగీత రసమాధురుల నాకళించికొన్న బహుముఖ ప్రజ్ఞాధురీణులు శ్రీమాన్ పుట్ట పర్తి నారాయణాచార్యులుగారు తాళ్ళపాక అన్నమయ్యగారి అసాధారణభావన, స్వతంత్ర మధుధార, ప్రబంధ జీవనౌషధము లనదగు జాతీయములు మొదలైనవానిని గూర్చి సహజగంభీర ధోరణిలో వివరించినారు. ప్రాచీన నవీన సంగీత సంప్రదాయ సంస్కార శోభితులు, మధురగాయకులు అయిన శ్రీబాలాంత్రపురజనీ కాంతరావుగారు శృంగారమును ప్రధానముగా స్వీకరించి అంతర్గర్భితముగా ఆధ్యాత్మబోధ సాగించుచు, నాట్యాభినయము లకు విశేషప్రాధాన్య మొసగిన రసికచక్రవర్తి క్షేత్రయ్య పదకవితా ప్రభావమును సరళ సుందరముగా నావిష్కరించినారు.

సంగీత కళారహస్య కోవిదులు శ్రీనల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులుగారు 'నానాప్రయోగ రాగాంశ రసభావోత్కటము లయిన కృతులను వెలయించి నాదసుధా రసమును పంచినచరితార్థుడు త్యాగరాజు రచనా ప్రావీణ్యము నుగ్గడించినారు'.

పదకవితా సౌరభమును తనివిదీర ఆస్వాదించిన సుధీమణులు శ్రీనూకల చినసత్య నారాయణగారు 'భక్తిరసపరమావధిని సాధించి నిజజీవితములో భక్తివైరాగ్యముల నారాధించిన గోపరాజు ప్రతిభా విశేషములను విశదీకరించినారు'.

తమ ఉపన్యాసములచే ఆంధ్రలోకము నలరింపజేసి మాకీసదవకాశము కలి గించిన విద్వాంసులకు పరిషత్తుపక్షమున కృతజ్ఞతలు తెలుపుకొనుచున్నాము. ఈ మాప్రయత్నము సర్వజన సమాదరణీయము కాగలదని విశ్వసించెదము.

గడియారం రామకృష్ణశర్మ.
కార్యదర్శి.

పరీధావి. పుష్యము.
ఫిబ్రవరి 1973

# విషయసూచిక


పుటలు

తొలిపలుకు iii

పదకవితా పితామహుడు - అన్నమయ్య

శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు. 1

క్షేత్రయ్య పదకవిత

శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావు. 32

త్యాగరాజు - పదములు

శ్రీ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు. 44

కంచెర్ల గోపన్న

శ్రీ నూకల చిన సత్యనారాయణ. 60

# "పదకవితా పితామహుఁడు అన్నమయ్య"

—పుట్టపర్తి నారాయణాచార్యులు.

ఒకనాడు ఆంధ్ర కర్ణాటములలో-భక్తి-జ్ఞానము-కర్మము-మొదలైనవి పండితుల భాష. వారు తమలోతాము రాద్ధాంత సిద్ధాంతము లొనర్చి కొనుచుండిరి. సామాన్యుల చెవిలో-నా పవిత్రోక్తులు పడరాదను భావముగూడ-పండితులలో ప్రబలముగా నుండెను. సామాన్యులేమి చేయుదురు! పాపము!! వారి బ్రతుకు వారిది; ఎప్పుడో-బ్రదుకు బరువు కొంత తీరినప్పుడు-పండితుల పజ్జఁ జేరుచుండిరి; దయతోవారు చెప్పు యెంగిలి మాటలే వారికి సర్వస్వము; తక్కిన బ్రదుకంతయు-చీకటిలో; తారాట; ఇంతలో బసవేశ్వరుఁడు పుట్టెను. అతఁడొక మహాజ్వాల; సామాన్య ప్రజలపై నాతని దృష్టి. అతని వచనము లావేశము గండరించిన రూపములు. ప్రజలలో నవి కారుచిచ్చువలె వ్యాపించినవి. 'త్రిపది'-'రగడ'-'షట్పదు'ల వంటి దేశి రచనలు ప్రథమ తాంబూలము నందికొనెను. జైనులతో నారంభమైన చంపూ కావ్యరచన-నిస్స్నేహమైన దీపమువలె నారిపోయినది. వీరశైవము-రాజసమైన భక్తి; సహజముగా నుత్సాహవంతులై-పాదరసమువలెఁ బారాడు-జన బాహుళ్యమున కామార్గమింపయ్యెను. వీరశైవుల వచన వాఙ్మయము కన్నడ సాహిత్యమున కొక వెలలేని తొడవు. పాలకురికి సోమనాథుడు-వానిని చూచియే తెనుగున ద్విపదను చేబట్టినాఁడు; ఇట్లు కొంతకాలము గడచెను. ద్వైతులలో శ్రీపాదరాయలు ప్రసిద్ధుఁడు; అతఁడు-ప్రజలు వీర శైవమును ప్రేమించుటలోని కీలకమును గమనించెను. అది ప్రజలభాష. అతఁడు 'దాసరకూటము'నకు పునాదు లేర్పరచినాఁడు; ప్రజల భాషలో సాత్విక భక్తి ప్రచారమునకుఁ బూనుకొనెను. శ్రీ పాదరాయలప్పటికే ప్రసిద్ధుఁడు. సాళువ నరసింహ రాయలాతని శిష్యుఁడు. ఆ రాజు బ్రహ్మహత్యా దోషమునీ రాయఁడు దొలఁచి యుండెను. అందుచే, నాతని పలుకుబడి యెక్కువ. ఈ ప్రాపకముతో నాతని పదములు ప్రజలలోనికి చొచ్చికొని పోయినవి. "దాసర కూటము" శ్రీపాదరాయలతో మొదలైనను-అది పుష్పించి, ఫలించినది, వ్యాసరాయలు పురందరుల కాలమందే. పురందరుల-పదవాఙ్మయమును వ్యాస రాయ "లుపనిషత్తు"లనెను. తాను దేవతార్చనలో పూజించు గ్రంథములలో పురందర పదములను చేర్చెను తానును-తన విద్యా గురువైన శ్రీపాదరాయలవలెనే పద రచన గావించెను. నాటినుండి-ద్వైత గురువులు

పద రచనను గా రచించుట పరిపాటిగా వచ్చెను. కనకదాసు-వాది రాజు-విజయ రాయలు-జగన్నాథదాసు - మొదలైన పదకర్తలు కుప్పలు తెప్పలుగా వెలసిరి. మొన్నటి రాఘవేంద్రస్వామి గూడ-ఉడిపి కృష్ణునిపై నొక్క పదమును బాడిరి. 'దాసరి కూటము'తో-ప్రజలలో ద్వైత భక్తి వ్యాపించెను. పురందరుల నాటికే పద సాహిత్యము గొన్ని లక్షలుండెను. పదకర్తలలో కనకదాసు మహా గంభీరుడు; గొప్ప సాహసము గలవాడు. పురందరులలో లాలిత్య మెక్కువ. ఒకవైపు ప్రజలలో నివి చొచ్చుకొని పోవుచున్నను, ఇంకొకవైపు వీనిపై పండితుల యాక్షేపణలు తగ్గలేదు. భాషా గౌరవము చెడినదని మూతి ముడిచిరి. పవిత్ర ప్రస్థానము-వీధిబడినదని బొమలు చిట్లించిరి దాసరకూటమున 'మడి' తక్కువయని వెక్కిరించిరి. పదకర్తలు వీరి యసమ్మతిని బాటింపలేదు సామాన్యులకీ కీచులాటలు గాబట్టలేదు. అన్నమయ్య చిన్ననాటి నుండి "ఆడిన మాటెల్ల నమృతకావ్యముగ పాడిన పాటెల్ల పరమగాన ముగ" నమరిన వాఁడట! ఈ యుత్ప్రేక్ష ఎట్లున్నను శ్రీపాదరాయల పదములే రచనోత్సాహమును గల్పించి యుండును. తన చుట్టును వినబడుచున్నవా పాటలేగదా! అన్నమయ్య పద్యము లెందుకల్లలేదు ? అల్లిన వెందుకువ్యాప్తికి రాలేదు? నా దృష్టిలో దానికిఁ గారణమిది. శ్రీపాదరాయల యొుఁబవడిలో నాతఁడొకటి రెండు పాటలు తమ యూరి చెన్నకేశవునిపై పదములు బాడి యుండును. ఆ యూరివారు 'బాగుబాగ'ని యుందురు. ఆ యుత్సాహమట్లే సాగి 'పద కవితాపితామహుడగు' వరకును పోయి యుండును. వాస్తవమున కన్నమయ్య సంతరించికొన్న సామగ్రి యంతయు కావ్య కర్తకుండవలసినది. చేసినది పద రచన; కావ్యకర్తగావలసినవాడు-పదకర్త యైనాడు. అతడు వేసిన తప్పటడుగు మన భాగ్యమైనది; లేకున్న-అన్నమయ్యగూడ ఒక నాచనసోమనాథుఁడై యుండెడివాడు. ఆ బిరుదులు లేవుగాని-అతని వలెనే యితడును-"సాహిత్యరస పోషణుఁడు". "సంవిధాన భూషణుడు". ''సకల భాషా చక్రవర్తి''.

అన్నమయ్య తలితండ్రులకు చాల దినములవరకు సంతానము లేక పోయిన దట! అతని తల్లి లక్కమాంబ. ఆమెతో మాడుపూరి మాధవస్వామి మాటాడెడు వాఁడు. ఆ సాధ్విక్రొత్తడి తన మట్టిది.! ఆ దంపతులు సంతానముకొఱకై 'తిరువేంగ డముడైయ్యా' నునకు సేవఁ జెల్లించిరి. స్వామి కలలో సాక్షాత్కరించి తాఁబూను "బిరుదుగజ్జియల కటార"మిచ్చెను. అందుకే అన్నమయ్య నందకాంశమున బుట్టె నందురు. అంతకుముందే యన్నమయ్య తాతకు 'చింతలమ్మ దేవత' యొుకసారి గన్పించినది. ఆమె యాతనికీరీతి వరమిచ్చినదట!—

"అదియును గాక మూడవ తరమ్మునను,
వదలని కీర్తి మీ వంశంబునందు
పరమ భాగవతుండు, ప్రభవించు శౌరి
వరమున జగదేక వల్లభుండతఁడు"—

అని చెప్పి కనుమఱుగైనది. ఆ వరము ఫలమే అన్నమయ్య. ఈ పేరేమో క్రొత్తగా నున్నది. వారి పూర్వులలో నీ పేరులేదు. ఈ నామకరణమునకు మనుమడిట్లు సమాధానము చెప్పినాఁడు.

"సకల వేదాంత
జాతచోదితమునై, జలజోదరునకు
నామమై విన పరిణామమై మున్ను
హేమాంబరుండానతిచ్చినయట్టి
అన్నమయాహ్వాయంబు"—

ఈ వివరణముతో మన సందేహము తీరి పోలేదు. "అన్నమయ్య" యని విష్ణువునకు పేరెట్లోమనకుఁదెలియదు. చిన్ననాడే యీతని తలిదండ్రులు-"అన్నయ్య-అన్నప్ప. అన్నమాచార్య"—అని ముద్దాడినారట. ఈతడు వైష్ణవుడగునని వారికెట్లు తెలిసెనో ! వారి పూర్వులకే గొంత వైష్ణవముపై నభిమానముండెనో మనకు తెలియదు.

అన్నమయ్య తొలికీర్తన యేదో! అతని కుమారులకు గూడఁ దెలిసినట్లులేదు. అతని పదకవితా ప్రవాహములో వారది గమనింపలేదేమో ! అట్లే అతని తుది కీర్తన గూడ మన మెఱుఁగము. రాగి రేకులపై ముద్రించిన వారీ విషయమును గమనించినట్లు లేదు. అన్నమయ్య వైశాఖ మాసమున-విశాఖ నక్షత్రమున-శక్తికి పరాశరుఁడు పుట్టినట్లా తండ్రికిఁబుట్టెనట ! చిన్ననాఁడే-యన్నమయ్యకు వడుగైనది. వేదాధ్యయనము గూడ సాగెను ఇంతలో—

"అహి నాయకాద్రి
వెన్నునివరముచే విద్యలన్నియును
నమితమ్ములగుచు జిహ్వారంగసీమ
తము దామెసొచ్చి నర్తన మాడదొడగె"—

"ప్రపేదిరే ప్రాక్తన జన్మవిద్యాః"— ఈ విషయముపై నాకంత నమ్మకములేదు. మీరు నమ్మిన నా యాక్షేపణలేదు. వేదాధ్యయనముతో బాటు-ఆతని కింటిలో-తెనుఁగు సంస్కృత పాఠము జరగుచుండె నేమో!! ఆంధ్ర భాషాభిమానము నియోగుల కుగ్గుపాలు గదా! ఇట్లుండగా నొకనాడు-అన్నమయ్యకు స్వామి కలలో గన్పించినాఁడు. పంచాస్త్ర కోటిస్వరూపుడు; రవళించు పసిడిమువ్వల యందెలు; పైడివలువలు; గొజ్జంగి ముత్యాల కుచ్చు కటారి; కటిమీద బెరసినకేలు; వరముల నొసఁగు కెంగేలు; కెంపుల బిటారించు నొడ్డాణము; కేయూర హారములు; గుబాళించు తట్టుపునుఁగుమైపూత; కుడి రొమ్ముపై నిగనిగని మచ్చ; కడలికన్నియ దివ్యకంఠసరము; భుజకీర్తులు; బాహుపురులు; తాయెతులు; మకర కుండలములు; మణి కిరీటము; ధవళారవింద నేత్రములలోఁ దనియించు చల్లనిచూపు; ముత్తెపు నామము; మొగపుల మొలనూలు; బొడ్డు మానికము; భుజగ భూషలు; పుత్తడి జన్నిదము;—ఓ!! త్రి జగన్మోహనముగ నున్నది ఆ స్వామి "నాకై పద రచనలల్లుమ"ని- యాదేశించి వెళ్ళెను. అందుకే అన్నమయ్య—

"సందేహ మెక్కడాలేదు. సంతోషించుకొంటినేను
కందువ బ్రహ్మానందము గైకొంటి నేను
నున్నగా సంకీర్తన నానోరికిచ్చితి గనుక—
యెన్నగ నీ దేర్తువని యియ్యకొంటి నేను".

"శ్రీకాంతుడ! నీమూర్తి, నా చిత్తములో నిల్పినాను
నాకు నీవు గలవని నమ్మితినేను
దాకొని లోకములో, నీ దాసుండని పించగా
యీకడ నేలితివని యెరిగితి నేను".

"కైవసమై నీవు నాకు కలలోన నానతీయంగా
నావద్ద నున్నాడవని నమ్మితినేను-
ఏ వేళా శ్రీ వెంకటేశా! యెదుట నుండగాను
పావనమై యన్నిటాను, ప్రబలితి నేను"—

అన్నాడు. అన్నమయ్య కన్నయు వదినెయు నుండిరి. తాళ్ళపాక పల్లెటూరు. ముఖ్యవృత్తి వ్యవసాయమై యుండును. నలుగురు నాలుగు పనులు చేసినగాని-పూట గడువదు, పశువులకు-కసవు దెచ్చుట బాలుడైన యన్నమయ్య వంతు. అతఁడు కొడవలిగొని యడవికి జనెను. మరకతాంకూర కోమల ధర్మరుచులతో-కనులలో-

గడ్డి పచ్చలు వోయుచున్నది. అతఁడుత్సాహముతోఁ గోయనారంభించినాఁడు. చేతము తిరువేంకటాద్రిపై-చేతులు గడ్డి గోయుటయందు; ఆ యేమఱుపాటులో వ్రేళ్ళకు కొడవలి దగిలినది. నెత్తు రొడియఁజొచ్చెను. అతని జీవితములో నిదియొక ముఖ్య రంగము. అన్నమయ్య లోక సామాన్యుడైన బాలుఁడుగాడుగదా! అతని మనస్సులో నీ భావము బవిరె జుట్టెను.

## రాగం - సామంతం

"అయ్యో! పోయెంబోయె గాలము
ముయ్యంచు మనసున నే మోహమతి నైతి"
"చుట్టంబులా! తనకు సుతులు, కాంతలు చెలులు
వట్టియాసల బెట్టువారె కాక
నెట్టుకొని వీరుకడు నిజమనుచు హరినాత్మ
బెట్టనేరక వృథా పిరువీకు లైతి"
"తగు బంధులా! తనకు తల్లులును-తండ్రులును
వగల బెట్టుచు దిరుగు వారె కాని—
మిగుల వీరలపొందు మేలనుచు హరి నాత్మ
దగిలించ లేక చింతా పరుఁడనైతి—"
"అంతహితులా! తనకు నన్నలును దమ్ములును
వంతు వాసికి పెరుగు వారెకాని—
అంతరాత్ముఁడు వెంక టాద్రీశు గొలువకిటు
సంతకూటముల అలజడికిలోనైతి ॥అయ్యో॥

—ఆ నాళ్ళలో వెంకటాద్రిలో యుత్సవములు సాగుచుండెను. వరుస జనము పోవుచున్నారు. కొడవలి నడవిలోనే పారవైచి అన్నమయ్య వారి వెంట బడినాడు. దూరమున 'తిరువేంగడము' గన్పించెను. ఆ శైలమును-ఆ స్వామిని-గూర్చిన కతలు గొన్ని యాతడది వరకే యెఱుగును. ఆహా !! ఆ కొండ యెట్లున్నది ? "అదిగో - అల్లదిగో-హరి వాసము" పది వేల శేషుల పడగల మయము "అఖిలోన్నతము-బ్రహ్మాదుల కపు రూపము." అఖిలమునులకు నిత్యనివాసము! బ్రహ్మానందమే రూపమైనది. ఆ శైలము సామాన్యముగాదు; నింగి నున్న దేవతల నిజవాసము. భక్తు

లకు మూల నున్న ధనము. నిగనిగలాడు బంగారు శిఖరాలు-అన్నమయ్య పాలి కా శైలము కైవల్య పదము వెంకటపతి సిరుల తానకము: సకల సంపదల రూపము: పావనములకెల్ల పావనము· ఆ శైలము వైకుంఠమునకు గాణాచి. మహిమలే తెట్టెలైన రూపు. అచట నున్నవి శిలలా! కావు వేదములే శిలలైనవి· పుణ్యరాసులే యేరులైనవి; బ్రహ్మాది లోకముల కొనలకొండ. ఎందుకుకాదు? ఆ కొండపై శ్రీదేవుఁడున్నాడు; సర్వ దేవతలచ్చటి మృగ జాతులు· జలధులే నిట్టచఱులు· తపసులే తరువులు; ఈ పొడవాటి కొండయే పూర్వపు టంజనాద్రి; వరములు కొటారుగా వక్కాణించి పెంచేకొండ; లక్ష్మీకాంతు శోభనపుగొండ; కురిసి సంపదలెల్ల గుహలనిండిన కొండ; అదిగో! విరివైన వేంకటపుగొండ! ఈ తిరువెంకటాద్రికి-నాల్గుయుగములందును వైభవమే. నూటయిరువది యెనిమిది దివ్య తిరుపతులలోనిది యుత్కృష్టము; వైష్ణవులకు నూటయెనిమిది దివ్య దేశములున్నవి· వారికి శ్రీరంగము ముఖ్యము. దానిని వారు "పెరియరంగ" మందురు. శేషాచలము "సిరియ రంగము" నాలాయిర ప్రబంధములో చాల పాశురములు 'తిరువేంగడముడైయాను'ను గుఱించి చేసినవే. ద్వైతులకు గూడ వెంకటాద్రి ముఖ్యమైనది. వారు ఉడిపి కృష్ణుని 'అన్నబ్రహ్మ' యందురు. శ్రీనివాసుఁడు కనక బ్రహ్మ. పాండురంగడు నాద బ్రహ్మ. అన్నమయ్య యీ విషయములన్నియు క్రోడీకరించి కొన్నాడు ఆతడింకను తిరువెంకటాద్రిని తలపోయుచునే యుండెను. తిరువేంగడము అరయోజనము పొడవు; పదునొకండు యోజనముల పఱపట! పెద్ద యెక్కుడెక్కిన పిదప పల్లవరాయని మఠము; తరువాత యేట్లపేట. అవ్వచఱి; ఆపైని మోకాళ్ళ ముడుపు; ఇక్కడి నుండి పర్వతము సాలగ్రామమయము. ఆ కొండను కాళ్ళతో ద్రొక్కరాదు. మోకాళ్ళతో నడచుట జరిగెడిదట! అందుచే దానికి "మోకాళ్ళ ముడుప"ని పేరు. ఒక్కొక్క మెట్టును మోకాలి యెత్తుండును. మోకాళ్ళు ముడుచుకొని నడువ వలెను; అందుచే దానికాపేరయ్యెనని-గొందరు; అన్నమయ్య యాకొండ నెక్కుచున్నాడు. చెప్పుల కాళ్ళతో దాని నెక్కరాదని యాతడెఱుగడు. అలతయయ్యెను. ఒక వెదురు పొదక్రింద మైమఱచి నిద్రించినాఁడు. అలమేలుమంగ కలలో దర్శన మిచ్చినది. "నాయనా! చెప్పుల కాళ్ళతో కొండ నెక్కరాద"ని మందలించి, దివ్య ప్రసాదము నొసగి యాకలిదీర్చెను. అన్నమయ్యకు మెలకువయైనది; స్వప్నమును దలఁచికొని యాత డాశువుగా నమ్మవారిపై శతకము జెప్పెను. ఈ పద్యాంతములందు "వెంకటేశ్వరా!"యను సంబోధనమున్నది. కాని రచన యంతయు నమ్మవారి పేరనే; అప్పటికాతని వయస్సు పదునారేండ్లు; యాత్రికులతోపాటు కొండ నెక్కినాఁడు; కన్నులపండువై తెప్పలకోనేరు గన్పించినది.

"లోకపావనీ ! నీకు వేవేల మ్రొక్కులనుకొన్నాడు. తల్లీ ! ధర్మార్థకామమోక్షతతులు నీకు సోపానములు నాలుగు వేదాలు నీకు దరులు నీజలము నిండు సప్తసాగరాలు; కూర్మము నీలోతు; జగజ్జననీ ! గంగాది తీర్థములు నీ కడళ్ళు; దేవతలు నీ జల జంతువులు. పుణ్యలోకాలు నీదరిమేడలు; గట్టు మ్రాకులు పరమర్షులు. తల్లీ ! నీ యాకారము వైకుంఠనగరపు వాకిలి; చేకొను పుణ్యములే నీ దివ్యభావములు. ఏకడను వెంకటేశుడే నీయునికి"—అన్నమయ్య-ఆనందముతో శరీరమును మరచెను. పెద్ద గోపురమును దర్శించినాడు నీడ దిరుగని చింతచెట్టును బ్రదక్షిణించెను. ఆ వృక్షము శేషాంకమట ! గరుడగంబమునకు మ్రొక్కెను. చంపక ప్రదక్షిణము గావించినాడు. నడగోపురమును వందించెను విమాన శ్రీనివాసుని దర్శనమైనది. అలమేలుమంగ-యాగశాల-నరసింహుడు - జనార్దనుడు - ఆనంద నిలయము-బంగారు గరుడుడు, శేషుడు-ఓ ! దివ్య వైకుంఠముగా నున్నది. చిలుకలు-పంజరములలో స్వామిని నుతించుచున్నవి; శ్రీబండారము-బంగారు వాకిండ్లు-అన్నమయ్య గాంచెను. అంతకు ముందే ద్వారమున కెదురుగానున్న హనుమంతుని వీక్షించినాఁడు; పెద్ద జంగతోడి పెద్ద హనుమంతుడు; ఎడమచేత బలుముష్టి; పైకెత్తిన వలచేయి. శిరము మీద వాలుగానున్న తోక; మిన్నులు మోచుదేహము. కాంచనపు పట్టుకాసె; తొడల దాక వ్రేలాడు పెద్ద పతకము; నిడుపాటి దండలు; విఠ్ఠలమునకుఁ గావలిగనున్నాడు. ఈ కీర్తనలో నన్నమయ్య వెంకటాద్రిని విఠ్ఠలమనెను. ఆ రెంటిలో నీతని దృష్టికి భేదములేదేమో ! లేక జనులు దీనిని గూడ నాఁడు విఠ్ఠలమనుచుండిరో ! గుడిలో నన్నమయ్య సేన మొదలారిని వీక్షించెను. 'స్వామీ! నీ విందిరాపతికి నిజసేవకుడవు; నీక్రింద పసిడి బద్దలవారు పదికోట్లు: ముజ్జగాలజనులు నీ శిశువులు. దొరలైన నసురుల తుత్తురుమురుసేసితివి జగమొక రాజ్యముగ నేలితివి. సూత్రవతీ దేవికి ప్రభుడవైన నా స్వామీ ! నీవే వేంకట విభుని సిరుల పెన్నిధివి'— అన్నమయ్య శరీరము నిండ పులకలు మొలకలైనవి. కట్టెదుటస్వామి గన్పించినాడు. ఆహా ! ఆ పాదము లేమి?—

ముఖారి - ఆది

"బ్రహ్మగడిగిన పాదము
బ్రహ్మము దానీ పాదము"
"చెలగి వసుధ గొలిచిన నీ పాదము
బలి తల మోపిన పాదము

తలకక గగనము దన్నినపాదము
బలరిపుఁగాచిన పాదము ॥బ్ర॥

"కామిని పాపము గడిగిన పాదము
పాముతలనిడిన పాదము
ప్రేమపు శ్రీసతి పిసికేటి పాదము
పామిడి తురగపు పాదము ॥బ్ర॥

"పరమ యోగులకు పరిపరి విధముల
వరమొసగెడి నీ పాదము
తిరువేంకటగిరి తిరుమని చూపిన
పరమ పదము నీ పాదము ॥బ్ర॥

పై పాటలో బలిచక్రవర్తి వృత్తాంతము మొదట నున్నది. ప్రాచీనులనేకులు స్వామిని త్రివిక్రమావతారముగనే నుతించిరి. "నెడియోన్" అని యాతనికి పేరు. తమిళ సంఘసాహిత్యములో నాతనికీ పేరే చెల్లినది. తరువాత స్వామి యభయ హస్తము—

సామంతం – జంపె

"ఇందరికి నభయంబులిచ్చు చేయి
కందువగు మంచి బంగారు చేయి"

"వెలలేని వేదములు వెదకి తెచ్చిన చేయి
చిలుకు గుబ్బలి క్రిందఁ జేర్చు చేయి
కలికియగు భూకాంతఁ గౌగిలించిన చేయి
వలనైన కొనగోళ్ళ వాడి చేయీ"

"తనివోక బలిచేత దానమడిగిన చేయి
ఒనరంగ భూదాన మొసఁగు చేయి
మొనసి జలనిధి యమ్ము మొనకుఁ దెచ్చిన చేయి
యెనయ నాగేలు ధరియించు చేయీ"

"పురసతుల మానములు పొల్ల చేసిన చేయి
తురగంపు బరపెడీ దొడ్డ చేయీ

తిరువెంకటాచలా ధీశుడై మోక్షంబు
తెరువు ప్రాణులకెల్లఁ దెలుపు చేయా"—

అన్ని సేవలు వరుసగా నాతడు దిలకించుచుండెను. శుక్రవారపు పూజను దర్శించినాడు. అదియొక విలక్షణముగా నున్నది. ఆ తిరుమజ్జనోత్సవ వైభవమును అన్నమాచార్యు డిట్లు వర్ణించెను.

"కంటి శుక్రవారము గడియలేడింట
అంటి అలమేల్మంగ అండనుండే స్వామిని"

"సొమ్ములన్నీ కడఁబెట్టి, సొంపుతో గోణముగట్టి
కమ్మని కదంబము కప్పు పన్నీరు
చెమ్మతోన "వేష్టువలు" రొమ్ముతల మొలచుట్టి
తుమ్మెద మైచాయతోన నెమ్మదినుండే స్వామిని"

"పచ్చకప్పురమె నూఱి పసిడి గిన్నెలనించి
తెచ్చి శిరసాదిగ దిగ నలది
అచ్చెరుపడి చూడ, అందరికన్నులకింపై
నిచ్చ మల్లెపూవువలె నిటు తానుండే స్వామిని"

"తట్టుపునుఁగెకూర్చి, చట్టలు చేరిచి, నిప్పు
పట్టికరఁగించి, వెండి పళ్యాల నించి
దట్టముగ మేను నిండ పట్టించి దిద్ది
బిట్టు వేడుక మురియు చుండే బిత్తరి స్వామిని"

—ఇందులో 'వేష్టువ'లను చున్నాడు. అప్పటికి ఆతనికి గొంత వైష్ణవ సంప్రదాయ మర్థమైనది. నైవేద్యములన్నియు గాంచెను. ఓ !! వానికంతే మున్నది. ఆ నైవేద్య ములకు పదివేలరుచులు. మేరు మందరాలవలె మెఱయు నిడ్డెనలు-సూర్యచంద్రులవంటి చుట్టు పళ్ళెములు-చుక్కలు రాసి బోసినట్లున్న ఆరని రాజనాల యన్నము. పలుజల ధులవంటి పైడి వెండిగిన్నెలు. వెలిగొండ లంతేసి వెన్నముద్దలు "అలరు వెన్నెల రసము" లందిచ్చినట్లున్న పంచదార కుప్పలు. తేనెలగిన్నెలు. టెంకాయపాలు ఆనవాలు, వెన్నట్లు-అరిసెలు, గారెలు. కరిజి కాయలు, కండమండెలు, పూరణపు కుడుములు ఇంకా యెన్నో యెన్నో— ఆ స్వామిని జూచి అన్నమయ్య కోరికతో

నిట్లు పొగడెను. "పురుషోత్తమా మిమ్ము పొడగంటిమి. కోరికలెడసేయకయ్య కోనేటి రాయా!! నాకు "శానా శానా" యాసలున్నవి. నీవు మమ్మేలిన కులదైవము. మా పెద్దలిచ్చిననిధానము, మా చిత్తములోని చేరువ. కైవసమైన పారిజాతము చేవదీర గాచినట్టి చింతామణివి; కోరిక లిచ్చుకామధేనువు. చెడనీక బ్రదికించే సిద్ధ మంత్రము రోగాలడచి రక్షించే దివ్యౌషధము; బడివాయక తిరిగే ప్రాణబంధువు; మమ్ము గడియించినట్టి శ్రీ వెంకటనాథుడవు స్వామీ !! నీవే నన్నేలుకోవలెను. "నీ యభయ హస్తము సేవించి చేకొన్నవారి చేతి భాగ్యము"— అనుచున్నాఁడేగాని అన్నమయ్య కింకను శ్రీనివాసుని యభయ హస్తముచేతి భాగ్యముగాలేదు. ఆచారమునుబట్టి చెప్పు చున్నాడంతే; స్వామి యర్థముగావలసి నట్లింకనుగాలేదు. పై పై వేడుకలతో వ్యవ హారముసాగిపోవుచున్నది; మరల నెందుకోయూరికి తిరిగి వచ్చెను కాని గాలి మాత్రము కొండపైననే యున్నది; ఊరి జీవితము తనకుఁబట్టినదికాదు. అవకాశము దొరికినఁజాలు కొండకేగుదమనుచింత. నిరంతరము భావనానేత్రము నెదుట స్వామి; కొండలోని కూటువనెమళ్ళ-కోవిల గుంపులు. పేటుల తేటుల పెనుకూటములు. కోరిన పండ్లు గురిసేటి తరువులు ఆటలఁదిరుపులు-నందపుధారలు; "ఎపుడెపుడు స్వామి యుత్సవములు మొదలగుఁను. ఎప్పుడెపుడు గరుడధ్వజము నెత్తుదురు; మొదటి తిరునాళ్ళ దినము లెప్పుడెపుడువచ్చు" నిదేచింత. వానలలో ననేక జనములు పోవు చున్నారు. వారిలోఁ దానొకఁడు. ఇవి యేకలలు అప్పుడపుడాత డింటిలో జెప్పుఁడు. బుద్ధిపుట్టినదే పరువెత్తి పోవును; స్వామి నాతురతతో జూచును. ఊరిలో నున్నపుడు స్వామికి సంబంధించిన కతలు వినును. ఓహో !! భాగవతములో బలరాముని తీర్థ యాత్రకథ వచ్చును. ఆతడే స్వామిని సేవించెను. నా స్వామి యంతటి ప్రాచీనుడా? బ్రహ్మాండ పురాణములో స్వామిగాథ యున్నది. వామన పురాణములో నున్నది; సప్తర్షు లీదేవునకుఁ బ్రదక్షిణము లొనరించిరట ! కోనేటి చింత గుమారస్వామి తపము సేసి యీస్వామి దర్శన భాగ్యము వడసెను; నారదాదులకీతని సంకీర్తనలో నలసట లేదు; బ్రహ్మాదులకీతడేడుగడ; ఇట్టి కతలన్నియు-మాటిమాటికి మననమొనర్చికొనెడి వాడు. తిరుమల నంబిని-తిరువెంగడముడైయాను "ఇతడు మా తాత"—యనెను. అంత యుదారుడాస్వామి ! కురువ నంబి సమర్పించినచేతి బంకమట్టి పువ్వులు గొనెనట! అంతటి సులభుడా యీదేవుడు ! అనంతాళ్వారు చెరువుగట్టగా-తానై మన్నుమోసెనట ! ఇంతటి భక్తపరాధీనుడా యీవేలుపు ! తొండమాన్ చక్రవర్తికి సంపదలిచ్చెను. ఇంతటి యీవికాడా ! స్వామి ! ఎఱుకు వారి కొఱ్ఱచేను వెన్నులారగించెనట ! ఎంతటి వెంగలి! గొల్లల కావిళ్ళ పాలెల్ల త్రాగెనట ! ఎంతలేకివాఁడీ ప్రభువు ! సంపంగిమ్రాకుల నడపించె

నట ! ఆయనక సాధ్యమేమున్నది ? పరుస వారికెదురుపోయి వెంటవచ్చుట ! అందమైన బంధు ప్రేమ; ఈ భావములన్నియు-నాతని మనస్సును రెచ్చగొట్టెను. ఈ స్వామిని పట్టుకొని తీరవలెను ఇతడే జగతిలో నాకు సర్వోపాయములు. ఈ స్వామి పుష్కరిణీ జలమే సకలగంగాది తీర్థ స్నానము. వెంకటాచలవిహారమే, సకల పుణ్య క్షేత్ర యాత్రలు; శౌరి సంకీర్తనమే-సకల వేదాధ్యయన శాస్త్రపాఠము; జాతుపడిన యీకైంకర్యమే-సకల కర్మానుష్ఠానము; ఇతని ప్రసాద భక్షణమే ఉపవాస తపోవ్రతాదులు, జపరహస్యోపదేశములు. వేరేమి యున్నవి ! స్వామి పాదమును శరణనుటయే ! అచటి బహు వృక్షదర్శనమే పుణ్య ఋషుల దర్శనము. పక్షికుల కలకల రవమే పుణ్యకథాశ్రవణము. అచటి వైష్ణవ సహవాసమే సజ్జన సంగతి; శరణాగతియే ప్రార్థన ఇతని పట్టపురాణి అలమేలుమంగ కడగంటి చూపే నాతపః ఫలము;" ఇప్పటి కన్నమయ్యకొక కుదురు దొరకినది. సంకీర్తనతో శ్రీనివాసుని బట్టవలెనను కొన్నాడు. ఆ భావమింకను రక్త మాంసముల కంటలేదు; బౌద్ధికముగా నిర్ణీతమైనది.

దినములు గడచుచున్నవి. ఒకసారి-యాతడు మరల తిరుపతికి ప్రయాణము గట్టెను. అమ్మవారి సేవింపమనసు పోయినది. ఆకలిజూచి యన్నముబెట్టిన తల్లిగదా ! ఆదేవి యాతనికి క్రొత్త రూపులో గనుపించెను. స్వామి యామె నాట్యమును జూచు చున్నట్లు-ఆమె యాడుచున్నట్లు, అతఁడు వెంటనే

### శంకరాభరణం

అలరులు గురియగ నాడెనదే !
అలకల కులుకుల నలమేలుమంగ ॥అ॥

అరవిరి సొబగుల నతివలు మెచ్చగ
అరతెరమరుగున నాడెనదే !
వరుసగ పూర్వ దువాళపు తిరుపుల
హరి గరగింపుచు నలమేలుమంగ ॥అ॥

మట్టపు మలపుల, మట్టెల కెలపుల
తట్టెడి నడపుల, దాటెనటే !
పెట్టిన వజ్రపు పెండెపు తళుకులు
అట్టిటుచిమ్ముచు నలమేలుమంగ ॥అ॥

చిందుల పాటల, సిరిపొల యాటల
అందెలమోతల నాడెనదే !
కందువ తిరువెంకటపతి మెచ్చగ
అందపు తిరుపుల నలమేలుమంగ ॥అ॥

—అను పాట పాడెను. అక్కడినుండి కొండకు వెళ్లినాడు. త్రోవ పొడవునను-స్వామిపైఁబాటలే. అవి యన్నియు-శృంగార రసమయములు. రివాజుప్రకారము కొండపై సేవలన్నియు జెల్లించినాడు ఒకనాఁడు-'ఘనవిష్ణు'-వను విప్రునకు స్వామి కలలోఁ గన్పించెను. కనుపించి-యన్నమయ్యకు ముద్రాధారణ మొనర్పవలెనని-తన ముద్రికలనిచ్చెను. ఘనవిష్ణువా యువకుని వెదకికొని వచ్చినాఁడు. స్వామి యానమేరకు జక్రాంకన మైనది. పంచసంస్కారములు జరగెను. ఆనాటితో నన్నమయ్య-"అన్నమయ్యంగారు"-కావలెనను కొన్నాడు. కొన్ని దాన శాసనము లట్టే జెక్కించి కొనెను. అప్పటి నుండియు-వైష్ణవులాతనితోగలిసి భుజింపఁదొడఁగిరట. ఆ సందర్భమున రామానుజులపై నీ పాట జెప్పియుండ నోపును.—

దే శా ళ ం

గతులన్ని ఖిలమైన కలియుగమందు
గతి యీతడే చూపె ఘన గురుదైవము
ఈతని కరుణనేకా యిల వైష్ణవుల మైతి
మీతనివల్లనే కంటి మీ తిరుమణి
యీతడేకాయుపదేశమిచ్చె నష్టాక్షరమంత్ర
మీతడే రామానుజులు యిహపరదైవము ॥గ॥
వెలయించె నీతండెకా! వేదపురహస్యములు
చలిమి నీతండె చూపె శరణా గతి
నిలిపినా డీతండెకా ! నిజ ముద్రాధారణము
మలసి రామానుజులే మాటలాడే దైవము ॥గ॥
నియమము లీతండెకా! నిలిపె బ్రపన్నులకు
దయతో మోక్షము చూపె దగనీతడె
నయమై శ్రీవెంకటేశునగమెక్కి వాకిటను
దయజూచి మమ్ము నిట్టె తల్లిదండ్రి దైవము ॥గ॥

—వైష్ణవ దీక్షతో-మనస్సులో దిటవేర్పడినది "అష్టాక్షరి – ద్వయము"-చరమ శ్లోకము. ఇక సాధన సామగ్రి కే కొదవ యున్నది? శ్రీనివాసుడు-చిక్కితీరును. ఆధైర్యముతో నీ కీర్తన వచ్చియుండును

రా మ క్రి య

చాలెద నిదియే సత్యము సుండో
చేటు లేదితని సేవించినను ||చా||

హరినొల్లనివా రసురులు సుండో
సురలీతని దాసులు సుండో!
పరమాత్ముడితని ప్రాణము సుండో
మరుగక మఱచిన మరి లేదికను ||చా||

వేద రక్షకుడు విష్ణుడు సుండో
సోదించెశుకుడచ్చుగ సుండో
ఆది బ్రహ్మ గన్నాతడు సుండో
యేదెస వెదకిన నతడే ఘనుడు ||చా||

ఇహ పరమొసగను యీతడె సుండో
వహినుతించె బార్వతి సుండో
రహస్య మిదివో! రహి శ్రీవెంకట
మహీధరంబున మనికై నిలిచె ||చా||

—ఊరికి వచ్చినాడు. జనుల మానసిక ప్రవర్తనలు వింతలైనవి. వెంకటేశ్వరునిపై నీతని ధారావాహికమైన కీర్తన భక్తిని జూచి-నలుగురు నాల్గు మాటలన్నారు. వీనికి బిచ్చియెత్తినదని కొందరనుటలో నాశ్చర్య మేమున్నది? ఈ శృంగార పదాల పిచ్చి పెండ్లితో దీరుననుకొన్నారు ఒకరికిరువురు భార్యలు సంసార సుఖము మెడబంటిగా గ్రోలుచున్నాడు. శృంగార పద రచన రెండింతలైనది. కీర్తనల, రచనలో-భావములలో-చమత్కారము ప్రధానమైనది. ఆ సమయములో నల్లినదే—

సా ళ ం గ నా ట

పలుకు దేనెల తల్లి పవళించెను
కలికితనముల విభుని గలసినది గాన ! ||ప||

నిగనిగని మోముపై నెఱులు గెలకులజెదర
పగలైన దాకచెలి పవళించెనూ
తెగని పరిణతులతోఁ దెల్లవారిన దాక
జగదేకపతి మనసు జట్టి గోనెఁగాన ॥ప॥

కొంగుజారిన మెఱుఁగు గుబ్బలొలయగఁదరుణి
బంగారు మేడపై పవళించెనూ
చెంగలువ కనుగొనల సింగారములు దొలుక
నంగజ గురునితో నలసినదిగాన ॥ప॥

మురిపెంపునటనతో ముత్యాల మలగుపై
పరవశంబున దరుణి పవళించెనూ
తిరువెంకటాచలా ధిపుని కౌగిటఁగలసి
అరవిరై, నునుజెమట నంటినదిగానా ॥ప॥

——క్షేత్రయ్య యీ పదమునకు వలచి- "మగువ తన కేళికా మందిరము వెడలెన్"- అను పదముగా బాడినాఁడు, కంచిలో క్షేత్రయ్య "కట్లమ్మవారు" దర్శన మిచ్చినదని పెద్దలందురు; అన్నమయ్యకు గూడ నట్లే యగుపించెనేమో! యెవ్వరెఱుగుదురు? వైభోగములు - మేలుకొలుపులు-నలుగులు-గొబ్బిపదములు - దంపుళ్లు-కూగూగులు-వెన్నెలలు-తుమ్మెద పదములు-ఓ, ఒకటేమిటి?-తండోపతండములుగా పదరచన సాగినది. మచ్చున కొక తుమ్మెదపదము;-స్త్రీలు తుమ్మెదపై నెపమువెట్టి శ్రీనివాసు నదలించు చున్నారు.

శ్రీరాగము - ఏక

తొల్లింటివలెగావు తుమ్మెదా! ఇంక
నొల్లవు గామమ్ము నో తుమ్మెదా!
తోరంపు రచనల తుమ్మెదా! ఇంక
దూరేవు గొందులే తుమ్మెదా!
దూరిన నెరుగవు తుమ్మెదా మమ్ము
నోరగ జూడకుమో తుమ్మెదా! ॥తొ॥
తొలు ప్రాయపు మింద తుమ్మెదా! కడు
దొలిచేవు చేగలే తుమ్మెదా!

తొలుకరి మెఱుగవె తుమ్మెదా - యింక
నులికేవు మముగని వో తుమ్మెదా ! ॥తొ॥

దొరవు వెంకటగిరి తుమ్మెదా - మా
తురుమేలచెన కేవు తుమ్మెదా !
దొరకె నీ చనవులు తుమ్మెదా - యింక
నొరు లెరింగిరి కద వో ! వో ! తుమ్మెద ॥తొ॥

—ఈ క్రింది పదములో నెంత చమత్కారమున్నదో గమనింపుడు. ఒక్క నాయిక యందే యన్ని జాతులున్నవట !

ఆ హి రి

అన్ని జాతులు దానయై యున్నదీ
కన్నుల కలికి మాయ, గరచెనో యనగ ॥అ॥

కన్నె శంఖిణి జాతి గాబోలు వీపునను
సన్నపు మదనాంకములు జడిగొన్నవీ
వన్నెలుగ వలరాజు వలపు తలకెక్కించ
పన్నినటువంటి సోపానములో యనగ ॥అ॥

తెర వదలపోయ చిత్తిణి జాతిగాబోలు
నెఱులు విచ్చుచు, వీధి, నిలుచున్నదీ
నెఱ తనపు మరుడు తన నింత సేసిన, యంప
గరులిన్నియనుచు లెక్కటు వెట్టుగతి నీ ॥అ॥

కాంత హస్తిని జాతిగాబోలు, కరమూల
మంతమంతకు నలుపులై యున్నదీ
పంతంపు మరుడు తన భండార మిండ్లకును
దొంతిగానిడిన కస్తురిముద్రలనగా ॥అ॥

ఇదియు జగదీశుమోహిని తానెగాబోలు
కదలు కనుగవకెంపు గలిగున్నదీ
వదలకిటు వేంకటేశ్వరుని కుంకుమ పూత
చెదరి చెలికను గొనల జిల్లె నోయనగా ॥అ॥

— ఇట్టి చమత్కార ప్రధానములైన రచనలు-అన్నమయ్యలో కోకొల్లలుగా జూప వచ్చును. ఈ దినములలోనే యతడు భార్యలతోనో-ఒంటిగనో గొన్ని తీర్థ యాత్రలు సేసెను. గండవరము-నెల్లూరు - ఘటికాచలము మండెము - హంపి-అహోబిలము-ఇంక నెన్నియో క్షేత్రములు అచటి దేవతలపై కుప్పలు శృంగార కల్పనలు. ఇతడు వ్రాసిన లాలిపాట-జోలపాట మొన్నమొన్నటివరకును స్త్రీలు ప్రసిద్ధముగ బాడుకొను చుండిరి. పై పాటవంటిదే మరియొకటి ఒక కాంతయందే అన్నిరాసులు నున్నవట !

శుద్ధ రామక్రియ

ఇన్నిరాసుల యునికి యింతిచెలువపురాశి
కన్నెనీరాశి కూటమిగలిగినరాశి ॥ఇ॥

కలికి బొమ విండ్లుగల కాంతకును ధనురాశి
మెలయు మీనాక్షికిని మీనరాశి
కులుకు కుచ కుంభముల కొమ్మకును కుంభరాశి
వెలగు హరిమధ్యకును సింహరాశి ॥ఇ॥

చిన్నిమకరాంకపుబయ్యెదచేడెకు, మకరరాశి
కన్నెప్రాయపు సతికి కన్నెరాశి
వన్నెమై పైడితులదూగు వనితకుం, దులరాశి
తిన్నని వాడిగోళ్ళసతికి వృశ్చికరాశి ॥ఇ॥

ఆముకొను నొరపులమెరయు నతివకు వృషభరాశి
గామిడిగుట్టు మాటలసతికి కర్కాటకరాశి
కోమలపుచిగురు మోవి కోమలికి మేషరాశి
ప్రేమవేంకటపతి గలసె, ప్రియమిధునరాశి ॥ఇ॥

"ఎట్టుభరించే నింకాను. పట్టుటబరుపీప్రాయమునాకు" అని యొక నాయికచేత బాహాటముగా ననిపించు నంతటి విశృంఖలమాతని శృంగారము. ఈనాళ్ళలో పాడిన కీర్తనలలో-జిత్రములైన ముగింపులు. విచిత్రములైన యెత్తుగడలు.

వింత వింత వింతలూ - నీ
చింతలేపో చిగురింతలూ

ఫో! ఫో! ఫో! ఫో! విడవోయీ! – నీ
చూపు మాపై జాడించక
రేపేపో రేసులెల్ల – నీ
తీపేపో తీదీపులు ॥౧౦॥

—ఈ క్రింది దాని శైలీ విన్యాసమును గమనింపుఁడు.

ఆ హి రి.

తనివిమాలిన తలపు – తడవోరుపని బులుపు
అనువెఱుంగని కెలపు – అడియాస మెలఁపు
కనుగవలో సొలపు – కావిదీరని యలపు
వనితచిత్తములోని – వడగొన్న వలపు॥

వడలెఱుంగని నొగులు – నుల్లంబులో తగులు
వడియు కన్నాటిలో – వగలు
పొడలువెట్టెడి పొగులు – పొందువాసిన దిగులు
పడతికి నిదియెల్ల – పరికింప బగలు॥

వరవెఱుంగని మెఱపు – వింతలాగుల యొఱపు
మిఱుమిట్లు గొను మేని మెఱపు
తిరువెంకటాచలాధీశ్వరుని కనుగిలుపు
తరుణి కిటువంటి మెత్తనిపూవు పఱపు ॥౩౦॥

ఇంతగా జేసెగా నింతికన్నుల నగవు
సంతరించగరాని చనుదోయి బిగువు॥

—నాఁడు సాళ్వనరసరాజొక ప్రసిద్ధుడైన దండనాథుడు. ఇంచుమించుగా నన్నమయ్య వయసు. టంగుటూరిలో నుండెను. విజయనగరములో – సంగమ వంశము బలహీన మగుచున్నది. విరూపాక్షుఁడు విషయాసక్తుడు. వాని నాతని పెద్దకుమారుఁడగు రాజశేఖరరాయలు చంపించెను. వీనిని – తమ్ముఁడు – రెండవ విరూపాక్షరాయలు మడియించినాఁడు. ఈ భాతృహంత పరిపాలనము ప్రజలకిష్టము కాదయ్యెను. సామ్రాజ్య మంతయుఁ గల్లోలముగనున్నది. ఈ సంఘటనములు అన్నమయ్య రసదిగ్ధ హృద

యముపైఁ బనిచేసెను "దేహమిచ్చినవాని దివిరిచంపెడువాఁడు-ద్రోహిగాక - నేడు దొరయైనాడే! తోడబుట్టినవాని దొడరిచంపెడువాఁడు - చూడ దుష్టుఁడుగాక సుకృతి యైనాడే! కొడుకునున్నతమతింగోరి చంపెడువాడు - కడుపాతకుడుగాక ఘనుడైనాడే! తల్లిజంపెడువాడు తలపదుష్టుడుగాక - యెల్లవారలకన్న నెక్కుడైనాడే!"—

—ఈ యన్యాయములకు చెల్లబో! నేనేమి సేయుదునయ్యా!" అని బాధపడు చున్నాడు. ప్రపంచ ధర్మమంతయు దననెత్తిపై నున్నట్లు మెత్తని మనస్సులకున్న స్వాభావిక దౌర్బల్యమిది; ఈ సంఘటనలు - ప్రపంచముపై నాతనికి రోతగల్గించినవి. హృదయములో నెచ్చటనో వైరాగ్యరేఖ మొదలైనది. ఇంతలో సాళ్వ నరసఁడీతని దర్శించుటయు - 'నీవు చక్రవర్తివగుదు' - వని యితడు దీవించుటయు జరిగినది. సింహాసనము నొడిచి కొనుటకు - సాళ్వనరసని ప్రయత్నములు సాఁగుచుండెను. ఈమధ్యసమయమునందుఁ బొంచికొని యుండిన గజపతులు - రెండుసార్లు దండ యాత్రలు నడపిరి. మరల గల్లోలము. ఆ దినములలో నీతఁడు - "ఒడ్డెబాస" - ను గూడ నేర్చికొనవలసిన యవసర మేర్పడెనట! ఆ పచ్చియారకముందే - తురుష్కుల దౌర్జన్యము కొనసాఁగెను. - "అయ్యయ్యో! కలికాలమహిమ" అని యితఁడు వాపోయెను. ఎక్కడ జూచినను నిరపరాధుల వధలు - మానభంగములు - నానావిధము లైన దుర్మార్గములు. ఈ మృత్యుకాండలో నాతని పూజావిగ్రహము నెవ్వరో దొంగి లించిరి. అన్నమయ్య దీన దీనుఁడైనాఁడు "ఓ అంజనీతనయా! ఓ ఖగరాజగరుడా! ఓప్రహ్లాదా! పోటుబంటవైన యర్జునుఁడా! శ్రీ వెంకటాద్రివైన శేషమూర్తి! ఓకార్త వీర్యార్జునుఁడా! నావిగ్రహములు దెచ్చిపెట్టుఁడని" బ్రతిమాలినాఁడు. వారెవ్వరును బలికినట్టులేదు. ఏమిసేయును ? ఊరూరుదిరిగి వెదుకనారంభించినాఁడు. తిరుపతికేగి శ్రీనివాసునితో గూడ మొఱవెట్టుకొనెనేమో! అట్టిదొక కీర్తనయుఁ జిక్కలేదు. ఈ సమయములో నాతఁడు - 'రామాయణ కీర్తనలు' - రచించి యుండెను. కాని - శృంగారపదములపై మమతపోలేదు. చమత్కారదృష్టి కొంత మందగించి యుండును. ఒకానొక దూతిక - నాయికకు - వెంకటేశ్వరుని సందేశము నీక్రింది విధమున విని పించుచున్నది.—

### పాడి

విభుని వినయములు వినవమ్మా! విను
అభయంబడిగే నయ్యో! తాను

రహస్యమున శ్రీరమణుడు పంపిన
విహరణలేఖలు వినవమ్మా !
అహిపతిశయనం బతితాపంబై
బహువేదన కగపడెనట ! తాను
అదె ! మాపతినీ యడుగులకె ఱఁగిన
వేదాంతరచన వినవమ్మా !
నీదయగానక నిమిషమెయుగమై
ఖేదంబున నలఁగెనటతాను
కింకరుడట ! నీ కినుకసేతలకు
వేంకటపతిగతి వినవమ్మా !
సంకెలేక నీచనవున జగములు
కొంకకిపుడెచే కొనెనట ! తాను

—పైపదములో – నేదో సహజసౌందర్య మున్నది. క్రొత్త క్రొత్త యలంకారములఁ గల్పింపవలెననెడి యాసతగ్గినది. ఈనాళ్ళలోనే శఠకోపయతితో సంబంధమేర్పడినది. వారివద్ద వేదాంత విద్యాభ్యాసము సాఁగెను. వైష్ణవులకు సంబంధించిన బాహ్యాచారము లన్నియు సమ్మతములై యొంటఁబట్టినవి. వారిపైనితఁడు బాడిన కీర్తనలు కొన్ని గలవు. ఇంతలో సాళ్వనరసింహరాయలు విజయనగర సింహాసన మాక్రమించెను. ఆతఁడిపుడు చక్రవర్తి. ఒకనాఁడిరువురకును గొప్పస్నేహముగదా! పైఁగాఁ దనకు సామ్రాజ్యమిచ్చిన దన్నమయ్య యాశీర్వాదముతోనే! అతనినిఁ జక్రవర్తి పెను గొండకు బిలిపించికొనెను. పెనుగొండలోని ప్రకృతి, సాహిత్యదృష్టి కనుకూలమైనది. అందువలన – ప్రభువుల విద్యాగోష్ఠు లచటనే జరగెడివి. అన్నమాచార్యుఁడు పెను గొండకు బోయినాడు. నిండుగాదీరిన కొలువు. ఆ కొలువునకా పరమవైష్ణవు డలంకా రముగ నున్నాఁడు. రాయలహృదముల్లాసముగ నున్నది. వెంకటేశ్వరునిపై నొక శృంగారపదము బాడుమన్నాఁడు. అన్నమయ్యయు నుత్సాహముగ నారంభించెను. హఠాత్తుగ నీక్రింది పాట దొరలినది.

నాదనామక్రియ

"ఏమొకో ! చిగురుటధరమున
యెడనెడ గస్తురినిండెను
భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదుగదా ! ॥ఏ॥

"కలికిచకోరాక్షికిగడ కన్నులుకెంపైతోఁచిన
చెలువం బిప్పుడిదేమో! చింతింపరె! చెలులు
నలువున ప్రాణేశ్వరుపై నాటిన యాకొనచూపులు
నిలువునఁబెరుకగ నంటిన నెత్తురుకాదుగదా! ॥ఏ॥

"పడతికి చనుగవమెఱుగులు పైపైఁబయ్యెద వెలుపల
కడుమించిన విధమేమో! కనుగొనరేచెలులు
ఉడుగనివేడుకతోఁ బ్రియుడొత్తిన నఖశశిరేఖలు
వెడలగవేసవికాలపు వెన్నెలకాదుగదా! ॥ఏ॥

"ముద్దియచెక్కుల కెలకుల, ముత్తెపు జల్లుల చేర్పుల
వొద్దిక బాగులవేమో వూహింపరెచెలులు
గద్దరి తిరువేంకటపతి కౌగిటి యధరామృతముల
అద్దిన సురతపువేళల అందముకాదుగదా!" ॥ఏ॥

—మరల ప్రాతవయస్సునాటి శైలియే. తాత్కాలికముగ గలిగిన యుత్సాహము. రాజునకు మహాసంతోషమైనది. వారు సహజముగ దురహంకారులుగదా! అన్నమయ్య వ్యక్తిత్వము నాతడు మఱచెను. అతని దీవనయును మఱచినాడు. ఇటువంటిపదము నాపైనొకటి జెప్పుమని యాతని పట్టుదల. అది అన్నమాచార్యుల కిష్టములేదు. రాజు చాలసారులు బ్రతిమాలెను. అన్నమయ్య వినలేదు. నరసింహరాయని యహంకార ముత్తాలమైనది. "మూరురాయరగండ" - సంకెల వేయించినాఁడు అతనికడనున్న సంకెళ్లలోనిది దొడ్డదట. అన్నమాచార్యుఁ డేమిచేయును? అతఁడు శ్రీహరిని దలఁచి యొకపాట బాడినాఁడు. సంకెళ్ళు విడిపోయినవి. ఆపాటయిది—

ము ఖా రి

ఆకటివేళల నలపైన వేళలను-
తేకువ హరి నామ మే దిక్కు మరి లేదు ॥ఆ॥

కొఱమాలి యున్నవేళ. కులముచెడిన వేళ
జెరవడి యొరులచే జిక్కినవేళ
నొరపైన హరినామ మొక్కటే గతిగాక
మఱచి తప్పిననైన మరిలేదు తెఱగు ॥ఆ॥

ఆపద వచ్చినవేళ, నారడిబడినవేళ
పాపపువేళల భయపడినవేళ
ఓపినంత హరినామ మొక్కటే గతిగాక
మాపుదాకా బొరలిన మఱిలేదు తెఱఁగు ॥ఆ॥

సంకెల బెట్టినవేళ, చంపఁబిలిచినవేళ
అంకిలిగా నప్పులవా రాగిన వేళ
వెంకటేశు నామమే విడిపించ గతిగాక
మంకుబుద్ధి బొదలిన మరిలేదు తెఱఁగు ॥ఆ॥

—రాయలు భయపడి-మరియాతని జోలికి పోలేదు. అన్నమయ్య తాళ్లపాకకో-తిరుపతికో కదలివచ్చినాఁడు. మరల నాతఁడు నరసింహరాయలను గలిసి కొన్నట్లు లేదు. ఇక్కడి కన్నమయ్య జీవితములో నొక పెద్ద యాశ్వాసము ముగిసినది. భగవచ్ఛక్తి ప్రదర్శిత మగుచున్నదేగాని-భగవంతుఁడగుపించుటలేదు. శ్రీనివాసుఁడాతనితో దోబూచులాడు చున్నాఁడు. సాహితీ బ్రువు లన్నమయ్య జాతీయములను దొంగలించి తమవిగాఁ జేసికొని-తృప్తి పడుచున్నారు. అతని పాటలకు నకళ్లుగొట్టిరి. ఛాయాపహారములు జేయుచున్నారు. ఇవియన్నియు నతని హృదయమును బాధించినవి. తనకీర్తి వారు దోచుకొనుచున్నారని వగపు. ఎక్కడో యశశ్చాపల్యముదాగి యున్నది. అప్పుడు చెప్పిన పదమే యిది.—

## రా మ క్రి య

"వెఱ్ఱులార ! మీరు వేరుక కలిగి తేడు
అఱ్ఱువంచి తడుకల్లంగరాదా !"
"ముడిచి వేసిన పువ్వుముడువ యోగ్యము గాదు
కుడిచివేసిన పుల్లై కుడువగారాదు
బడినొకరు చెప్పిన ప్రతిచెప్ప బోతేను
అడరు శ్రీహరికినది అరుహము కాదు"
"గంపె డుముక దినగానొక్క వరిగింజ
తెంపున గలసితే తెలియనెట్టు వచ్చు

జంపులం బలవరించగ నొకమంచిమాట
ఇంపైతే హరియందు యిచ్చు నా పరము"

"ఉమిసిన తమ్మలో నొక కొంత కప్రము
సమ కూర్చి చవిగొని చప్పరింపనేలా
అమరంగ ఛాయాపహారము చేసుక
తమమాటకూర్చితే దైవము నగడా!"

"చిబికి వేసినగింజ చేతబట్టగనేల
గబుక కెంగిలి బూరె గడుగంగ మరినేల?
తొబుక కవిత్వాల దోషాల బొరలితే
దిబుకార నవ్వడా! దేవుడైనాను"

"మించు చద్దికూటి మీద నుమిసినట్లు
మంచిదొక టిచెప్పి మరి చెప్పనేరక
కంచుపెంచు నొక్కగతినదికితే – మట్టి
పెంచువలెనే చూచు పెరుమాళ్లు దాని"

"పుచ్చినట్టిపండు బూజులోననెయుండు
బచ్చెనకవితలు బ్రాతిగావెందు
ముచ్చుగన్నతల్లి మూలనొదిగినట్టు
మ్రుచ్చిమి నుతులేల! మ్రొక్కరో! హరికి"

"ఉల్లిదిన్నకోమటూరకవున్నట్టు
జల్లెడనావాలు జారిపోయినట్లు
కల్లలుచెప్పియాకత కుత్తరములీక
మెల్లనేవుండితే మెచ్చునా! దైవము"

"నేతిబీరకాయ, నేయిఅందులేదు
రాతివీరునికి బీరము యించుకాలేదు
ఘాతబూరుగుపండు కడుపునదూది
ఏకులనుడుగులు యెక్కునా! హరికి"

"ఇఱుగువారెఱుగరు – పొరుగువారెఱుగరు
గొరబైనమాటలు గొణుగుచునుందురు
పరులగాదందురు బ్రాతిగారుతాము
విరసులట్టివారి విడచుదేవుండు"

"ఎన్నగ శ్రీవేంకటేశు తాళ్లపాక
అన్నమాచార్యులు అఖిలదిక్కులుమెచ్చ
ఉన్నతితోబాడి రొకఁడెవ్వఁడోదాను
సన్నొరసునట ! సమ్మతా ! హరికి"

—తనకు గొప్పకీర్తి వచ్చినది. పదకవితా పితామహుఁడయ్యెను. 'సంకీర్తనాచార్యుఁడై'నాఁడు. మరి యేమేమో యైనాఁడు కాని – భగవంతుఁడు చిక్కినదేదీ ? తానతనిపై సంపూర్ణదృష్టి నిక్షేపించినదేదీ ? అన్నమయ్య జీవితములో నిక్కడినుండియే నిజమైన సాధన యారంభమైనట్లున్నది.

ఇంతకుముందు సంసార "మమృతంపు నడబావి" గా నుండెను. తడిముద్దులు. చలివలపులు – మదనముద్రలు. ఇంటిలో జంగమ దీపములైనడయాడు పిల్లలు. అన్నమయ్యకు గొంతవయస్సు పడమటికిఁ దిరిగినది. శారీరిక దౌర్బల్య మేర్పడెను. జీవితమెన్ని గుణపాఠములనో నేర్పినది. ఇప్పుడాతనికి సంసారము – "జలధిలోపలి యీత, జమునోటిలోఁబ్రదుకు, చమురుదీసినదివ్వె, సమయించుపెనుదెవులు, సమరంబులోనునికి, సంటిగట్టినత్రాడు, చంద్రునిజీవనము, చలువలోపలివెండి, జలపూత బంగారు". ఇంతకుముందు స్త్రీలనాతఁడు చూచినచూపువేరు, నేఁడుగనుపడుపద్ధతివేరు, – "అంగనల ముఖాంబుజములు – అంగడికెత్తిన దివ్వెలు" – "ముద్దులకుచయుగములు" ముంగిటఁబసిడికుండలు, ఇతవులైనమోవులు – యెంగిలిజేసినట్టి తేనెలు, లింగములేని దేహములు లెక్కలేని ప్రియములు, గరువంబులతోడి యలుకలు – కంచములోని వేడికూరలు, ఎడనెడ కూటములు – యెండలో నీడలు, తెలివిపడని లేతనవ్వులు – తెంచగరాని వల్లెత్రాళ్ళు, మాటలోని మాటలు – మంచితనములోని నొప్పులు, నిగిడి తనివులేని యాశలు – నిప్పులమీదజల్లిన నూనెలు, తమకము తాలిమి – దప్పికి నెయి ద్రావినట్లు, స్త్రీజాతిని వలచి పైకొనగరాదు, వలదని తొలగరాదు" చిన్ననాఁడు గలలోఁగన్నడి ముచ్చటగ మాటాడిన నాస్వామి – సాక్షాత్కరింపఁడేమి ? ఆయన తప్పేమున్నది ? పిండికొలది నిప్పట్లు, ఎంతమాత్రమున నెవ్వరుదలఁచిన నతఁడంత

మాత్రమే. ఘనబుద్ధులకు ఘనుఁడు. అల్పబుద్ధులకల్పుఁడు.- "నీరి కొలఁదితామర !" ఆతని యవస్థ యిట్లుండగా-జనులాతని వెంటఁబడినారు. అన్నమయ్యకుఁ దెలిసియో తెలియకయో గొన్ని మాహాత్మ్యములు జరగినవి. తమ నొప్పులీతఁడు దీర్చునని యొకపేగుంపు; తనకేమి యీబెడద?. తానొకవైపు భగవంతునికై పొట్టు పొరలగు చున్నాఁడు. వీరా ! - తమకోర్కెలకై పీకికొని తినుచున్నారు. కాదనలేడు - కట్టుకొన లేడు. 'విరసపు జాలి'తో వేగుచున్నాఁడు. మగడు విడిచినా మామ విడువనియట్లు నగినా-మనసు రోసినా లోకులు మానరయ్యా ! తగిలేరు పొగిలేరు, దైన్యమే చూపేరు. మొగమోటలనేరు. పొసగ దేవుడిచ్చినా-పూజారి వరమివ్వనట్లు-తాను విడి చినా-లోకులు దన్ను విడువరయ్యా ! కొసలేరు, ముసరేరు, కోరిక దీర్చుమనేరు. పసలేని పనులకు ప్రాలుమాలేరు. మడుగుట తప్పినా - నోము ఫలమిచ్చినట్లు - కడగి వేడుకొన్నా కానిమ్మనరయ్యా తడవేరు, తగిలేరు, దేవదేవా ! యీ బుడిబుడి సంగా తాలతో నేనెన్నాళ్ల పొగులుదునని" - శ్రీనివాసునకు - నివేదించికొన్నాఁడు, తానా ! వేసరికయగు వరకు చదివినాఁడు. "కాని-ఫలమేదీ?"- అని యేడ్చుచున్నాఁడు - "స్వామీ ! బ్రదు కనిత్యమని తెలియును, అయినను "బ్రదుకంటే - పేరాస." ప్రాణముతీపి. చావంటే వెరపు. ఇట్టి యజ్ఞానికి-జ్ఞానమెట్లు గలుగును ? యోనిగతుడనై బుట్టి యోనికిమగ్నుడనైనాను. లోక బంద్ధుడను, నీ బుద్ధెరిగేనా ! నేనా !-సిగ్గెఱుగను, అయ్యా ! నీ చేతిలోనివాడను, నీవే విచారించి కావవలెను. తనకేడ చదువు. తనకేడ శాస్త్రాలు, యెంత చదివినా-మనసు చంచల బుద్ధిమానెనా ! జడ్డుమానవుఁడు చదువ చదువగా, ఆశ వడ్డివారుగాక వదలెనా ! గ్రుడ్డి కుక్క-సంతకు బోయి తిరిగిన - దుడ్డు పెట్టేగాని-దొరకెనా ? తిరువెంకటదేవా ! నాగతియేమని"- వా పోవుచున్నాఁడు. తాను చదివిన చదువు బ్రదుకు చదువు, పూర్వులిట్లే చదివిరా ?

## సామంతం

"నాటికి నాడే నాచదువు
మాటలాడుచును మరచే చదువు"

"ఎనయగ నీతని నెఱుగుటకే పో - వెనుకవారు చదివినచదువు
మనసున నీతని మఱచుటకే పో ! - పనివడి యిప్పటి ప్రౌఢల చదువు"

"తెలిసి యితనినే తెలియుటకే పో ! - తొలుత కృతయుగాదులచదువు
కలిగిన యీతనికాదననే పో - కలియుగంబులో కల్లరి చదువు"

"పరమని వెంకటపతి గనుటకె పో – దొరలగు బ్రహ్మాదుల చదువు
సిరుల నితని మరచెడి కొఱకే పో – విరసపు జీవుల విద్దెలచదువు"

—తన పరిస్థితికి దీన దీనుఁడై కుళ్లుకొను చున్నాఁడు. – "స్వామీ! శుకశౌనకాదులు సుఖమంది నట్లు–నిన్నుభావింప నేరక–మసిని కస్తూరియను కొన్నాను. సంసారముతో జిక్కువడుచున్నాను. బ్రహ్మానందమెఱుగని వాడనుగాన – పాపపుహేయ సుఖమే నాకు బ్రాతియైనది. చూపుల వైకుంఠము జూడనివాడను–ప్రపంచమందలి తీపులే దిరమైనవి. శ్రీహరిభక్తి చాలనివాడను గనుక తోయరాని కర్మములే దొడ్డయైనవి. నాయంత నా జ్ఞానము నమ్మినాడ గనుక మాయపు సంసారమే మనసైనది. జియ్యా! నాకేది దిక్కు". అని కుములుచున్నాఁడు.– "మనసా! ఇకనైన బుద్ధిగలిగి మనుము. భక్తిని సాధించుము. పంతము విడువకుము, శివునివైరిచేఁ జిక్కువడరాదు సుమా! వయసు ప్రాయములు కంతువారకము, కావడికుండలు, ఎంతేమేలు, యెంతేకీడు, యెప్పుడు నుండదు. కన్నవిన్నవారితో నెప్పుడును గాకుపడకుము. పుడమిలోఁ బ్రదుకులు పున్నమమాసలు, పోయివచ్చేవి. కన్నుల సంగాతము సేయకువే! వన్నెల మాటలచెవిని బెట్టకువే! వాసి విడువకువే!–" ఆ మనస్సు వినునా! దాని దారి దానిది. "అయ్యో! నికనెవరు దిక్కు"ని– బావురని యేడ్చును. ఆ మనస్సెట్లు స్వాధీనమగును? ఎండ లోని నీడ యీ మనసు – వానచేత కమలమువలెనాయె మనసు. గోనె బట్టిన బంకగుణ మాయె మనసు; మాన జిక్కిన కొలవంత మాయె మనసు; తేనె తేనెలోపలి యీగ తెఱగాయె మనసు; గడిరాజు బ్రదుకాయె కడలేని మనసు; నడువీధి పసరాయె మనసు; గడకు గట్టిన పాతయైనది మనసు; అడుసులోపలి కంబమైనది మనసు; సిరిగలిగినచోట చేరు నీమనసు" – అన్నమయ్యకు దిక్కుదోచలేదు. తాళ్లపాకకును. దిరుపతికిని ఆసువలె దిరుగుచున్నాడు.

ఇప్పుడు స్వామి ముందటివలె గన్పించుటలేదు. అతనిగూర్చి – అన్నమయ్య తలపులు మారినవి. ముందటినైవేద్యాలు – అలంకారాలు – పరుసజనుల పవాడాలు వీనిపై జూపు మందగించినది. శ్రీహరి పాదతీర్థమానాఁడు క్రొత్తగా నగుపించు చున్నది. అది– "మోహపాశాలుకోసి మోక్షమిచ్చే మందు, కారమై కంటగించని కడు చల్లని మందు, నూరని, కాచని యట్టి మున్ననిమందు వెలవెట్టికొనితే వల్లనిమందు. వేరు వెల్లంకులు గూర్చనట్టి వెందువోనిమందు. గురుతైన రోగాలు గుణముచేసే మందు. దురితములు పెడబాపే దొడ్డమందు. నిరతము బ్రహ్మాదులు నేరుపుతో సేవించేమందు, నరకము సొరనట్టి నయమైన మందు"–స్వామిగూడ గంభీరుడైనాఁడు.

## శ్రీరాగం - ఖండచాపు

"నిత్యాత్ముడై యుండి - నిత్యుడై వెలుగొందు
సత్యాత్ముడై యుండి - సత్యమై తానుండు
ప్రత్యక్షమై యుండి బ్రహ్మమై యుండు - సం
స్తుత్యుడీ తిరువెంకటాద్రి విభుడూ"

"ఏమూర్తి లోకంబులెల్ల నేలెడు నాతఁ
డేమూర్తి బ్రహ్మమెల్ల వెదకెడు నాతఁ
డేమూర్తి నిజమోక్షమియ్యజాలెడునాతఁ
డేమూర్తి లోకైక హితుఁడూ
యేమూర్తి నిజమూర్తి నేమూర్తియును గాడు
యేమూర్తి త్రైమూర్తు లేకమైన యాత
డేమూర్తి సర్వాత్మ డేమూర్తి పరమాత్మఁ
డామూర్తి తిరువెంకటాద్రి విభుడూ"

"ఏదేవు దేహమున నిన్నియు జన్మించె
నేదేవు దేహమున నిన్నియును నణగె, మఱి
యే దేవు విగ్రహం బీ సకలమింతయును
నేదేవు నేత్రంబులిన చంద్రులూ=
"యేదేవుడీ జీవులిన్నింటిలోనుండు
నేదేవు చైతన్యమిన్నిటికి నాధార
మేదేవుఁడవ్యక్తుఁడే దేవుడద్వంద్వు
డాదేవుడీ వెంకటాద్రి విభుఁడూ"

"ఏ వేల్పు పాదయుగ మిలయునాకాశంబు
యేవేల్పు పాదమిాశాంతంబనంతంబు
యేవేల్పు నిశ్వాస మీామహా మారుతం
బేవేల్పు నిజదాసు లీపుణ్యులూ

"యేవేల్పు సర్వేశు డేవేల్పు పరమేశు
డేవేల్పు భువనైక హితమనో భావకుడు
యేవేల్పుకడు సూక్ష్మ మే వేల్పుకడు ఘనము
ఆ వేల్పు తిరువెంకటాద్రి విభుడూ"

— మరల తాళ్లపాకకు వచ్చెను. మనసులో దిగులు. "అయ్యో ! తిరువేంగడవా ! నీ రూపమెట్లు పొడసూపేనో ! నా భాగ్యమెట్లున్నదో ! నాకే బుద్ధియానతిచ్చేవో ! కలిగిన నీ మాయయేగతిగడచేనో ! కోనేటిరాయా ! నాకెట్లాకెవసమయ్యేవో ! నాజన్మ ఫలమెట్లున్నదో ! నన్నెట్లు పాయకుండేవో ! శ్రీవెంకటేశా ! నిన్నెట్లు మెప్పించేనో ! ఎట్లా నా కోరిక చెల్లినో"–అని వాపోవును,

"వెదకి భావించినచో గట్టిగా నంతర్యామి కరుణించును. ఇంటిలోని చీకటే యిట్టె తప్పక చూచితే–వెంటనే కొంతవడికి వెలుగిచ్చును. అంటి కానరాని తన యాత్మ తప్పక చూచుకుంటే–గొబ్బున గన్పించును. ఎందుకు గన్పింపదు ? మించి కఠినపు రాతిమీద కడవబెట్టితే–అంచెలదానే కుదురైనట్లు. పొంచి హరినామమే ప్రొద్దు–నాలుకతుదను–యెంచి తలఁపదలఁప సుజ్ఞానమెందుకురాదు ? ఒక్కొక్క అడుగే ఒగి ముందు బెట్టితే–యెక్కువౌ కొండైనా వడి యెక్కుదుముగదా !.–శ్రీవెంకటేశునిట్లు దిన దినమును పక్కనంగొలిచితే బ్రహ్మపద మెక్కకుందునా ?". – అని యింతలోనే ధైర్యము. "అయ్యో ! నాకెక్కడి దైవము; అతఁడు బ్రహ్మాండనాథుఁడు, నేనొక్క మశకమును, నేను గోరునది యాతని ప్రత్యక్షము, నక్కయెక్కడ నాకలోక మెక్కడ? ఆవటించి నే జేసిన యపరాధంబులు వేవేలు. కావుమంచు వేడుకొనుచున్నాను. ఇది కడు సాహసముగదా ! అతఁడు స్వతంత్రుఁడు. నేను మాయా పరతంత్రుఁడను, అతనిపై భక్తిజేసి కనుటట ! ఎక్కడెక్కడికి? నేను మోసినది యేడుజేనెల శరీరము. అతఁడు విరాట్పురుషుఁడు. నేనతని ధ్యానింతునట ! ఏమి నవ్వులాట !. అతని చిత్తమునాకుఁ దెలియదు. బయలకు మొఱబెట్టుచున్నాను. యెక్కడి కెక్కడ సంగతి ?" – అని–యంతలోనే మరల నిరాశ యొక్కటెఱ, తనలోని కామాదులారలేదు. అవి క్రొత్త రూపమును గైకొనుచున్నవి. "శ్రీహరీ ! నీవు నాకు లంచమిచ్చినచో సరి ! లేకున్న తుచ్ఛపు నీ చేతలన్నియుఁజెప్పెదను సుమా ! గొల్లెతల వాడలోఁ జీకటి తప్పు జేసినావు వెల్లి విరిగ రేపల్లెలో వెన్నలు ముచ్చిలించినావు. తల్లిబిడ్డల నొక్కవావిగ జేసికొన్నావు, పెద్దమీనువై పుట్టి యాకలికిఁజిన్న చేపలఁదిన్నావు, నీసరి బావమఱఁదికి బండి రొప్పినావు. గాటపుటసుర కామినులతోడఁ గల్లలాడినావు. ఈడు బెట్టికొని

బోయెదాని యెంగిలిదిన్నావు. బలిచక్రవర్తి నిదిరిసినావు, శ్రీసతి పాదాలు నీమెడలో నంటగట్టి కొన్నావు. ఇవియన్నియు బైట బెట్టెద''నని బెదరించుచున్నాఁడు.

''ఓ రోరి వెంకటేశా ! నీవేమి తెలివిగలవాఁడవు. నీవునునావలెనే యొక వెఱ్ఱి వాడవు, అజ్ఞానముతో నిన్నొల్లని నరులనందఱను వీరడివై మోయుచున్నావుఁ వెఱ్ఱివి గాదా నీవు ? 'నారసేరు' తడవితే నాపేరంటావు వెఱ్ఱివాడవుగావా ! బంటులైనవారి కెల్ల పరతంత్రుడవై వెంట వెంట తిరిగేవు. అంటి రెండు కుచేలుని అటుకులకే మెచ్చేవు. వింటే మాకు నవ్వువచ్చీని ! పావనమై లోకమెల్ల బ్రదుకుడటంచు పేరులు వేవేలు పెట్టుకొన్నావు, శ్రీవెంకటేశుడవై వేవేగ నెవ్వరికైన వరములిచ్చేవు, ఓరి వెఱ్ఱివాడా !''–అని హాస్యమాడు చున్నాడు.

''నేనొక్కఁడ లేకుండితే నీ కృపకు బాత్రమేది ? పూని నావల్లనే కీర్తిబొందేవు నీవు.''–అని సవాలు చేయుచున్నాడు. ''నీకు నన్నుగాచుట ధర్మమయ్యా ! నీపాదము లకు మొక్కుచున్నాను. స్వామీ ! చేసిన పాపము చెప్పిన బోవునని–నా దోషము లన్నియు నెఱిఁగించు కొనుచున్నాను. నాపాపములకీ నరకాలుచాలవు, నేనెత్తిన జన్మలు వ్రాయుటకు వనములలోని తాటాకులుచాలవు. నా అనాచారపుటెంగిలిని నదులు పావనము చేయజాలవు, స్వామీ ! నేను నీ సూత్రపుఁబ్రతిమను, నాగుణాలు తలచకు. నీగుణాలే తలచుకో ! తిరుమంత్రమేనన్ను దెచ్చి నీ సొమ్ముగాఁజేసినది. నీ వెత్తిన అభయహస్తము మావంటి వారికొఱకేగదా ! అయ్యో ! పంచేంద్రియముల హాచపైరు మేసితిని. పాపపుణ్యములనే బందె జిక్కినాను. సంసారమనే ఓదముపై నడచి–కూపపు జన్మముపాలై కూయుచున్నాడను. ఆసలనేటి పెద్ద అంగిటి గాలాలుమ్రింగి, కోసేటి మాయవంటింటి కుందేలైనాను, చిత్తమనే బండారము కొల్లలాడి–కామాదులనే తలారు లకు జిక్కినాను. కాంతల మోహమనే కారడవిలోఁ జిక్కి, విజ్ఞాన మార్గమును దప్పి నాను. నన్నెవ్వరుద్ధరింతురని'' తహతహలాడు చున్నాఁడు.

''అబ్బా ! యీ నరజన్మ మెంతచెడ్డది ! హీనదెసలబొంది యిట్లనుండుట కంటె–నానావిధులనున్న నాడెమేలుగదా ! అరుదైన క్రిమికీట కాదులందునబుట్టి పరిభవములెల్ల బడితిని. ఇరవైనచింత నా డింతలేదు. అయ్యో ! యీ నరజన్మమునకంటె నాడెమేలు; హేయజంతువుల యందుబుట్టి పలువేదనలనెల్ల బడితిని. కలిమియు లేమియు గన డెఱింగి – నలగి తిరుగుటకంటె నాడెమేలు'' అని నరజన్మము నసహ్యించుకొను చున్నాడు. ఈ విషయమునే శ్రీమద్భాగవత మిట్లన్నది.

"యశ్చమూఢ తమోలోకే, యశ్చబుద్ధేః పరంగతః
తావుభౌ సుఖమేధేతే, క్లిశ్నత్యంతరితోజనః"

—అన్నమయ్య వేదన. పై శ్లోకముయొక్క వ్యాఖ్యానమే, "అబ్బా! ఈ జ్ఞానమెంత చెడ్డది. మతికంటె వెలినున్న మంటమేలు, చతురులౌటకంటె జడుడౌటమేలు" – అని నానా యాతనలతో దుఃఖములతో సుడిజుట్టుకొని పోవుచున్నాడు.

"స్వామీ! నీదయలేక యెవ్వరును దరింపలేరు. నేను నిన్ను కనుగొన లేదని – నాపై యెందుకుకినుక? నిన్నెవ్వరు నిజముగా కనుగొనిరి? జటాయువునకు మోక్షమిచ్చితివి, హరునివిల్లు విరిచితివి. రాతికి ప్రాణమిచ్చితివంటె – నిన్నువారు నమ్మిరా! నరుడంటనాడిరి. సరయువులో వైకుంఠమును జూపితివి, పమ్మిమారుతికి బ్రహ్మపట్టమిచ్చితివి, దుమ్ముగ రాక్షసుల కుత్తు మురు సేసితివి, నిన్నునమ్మిరా! రాజవంటనిరి, విభీషణుని కెందును జెడని పట్టమిచ్చితివి, పరశురాముని గెలిచితివి, నమ్మిరా ఆనాటిజనులు? "దశరథుని కొడుకేగదా!" – అన్నారు. దేవా! ధర్మరాజు వంటివాడే – నిన్ను మఱదివని బ్రమసెను. ఇంక – యెఱుకతోడి వివేక మెవరికున్నది? గరుడవాహనమెక్కి బాణునిచేతులు నరికి తిరిగితివి. నీవు దేవుండవని నమ్మరైరి. నరకాసురుని జంపి – నాతుల పదారువేల – వెరసి పెండ్లాడినది వివేకింపలేరైరి. బలు శంఖచక్రములుపట్టి బాలకులదెచ్చి – తెలిపిన నమ్మరైరి, సొగసి విశ్వరూపముజూపి – యగ్రపూజగొన – వెలయునీమహిమలు వివేకించరైరి, ప్రక్కన ద్రౌపదిగాచి – బ్రహ్మచే మ్రొక్కించికొని దిక్కైన, నమ్మరైరి దేవుండవని; శ్రీవెంకటేశా! నేను తెలియలేదని నీకేమి కోప" – మని తగవులాడు చున్నాడు.

"ఎలమి హరిదాసు లేజాతి యైననేమి? తలమేల? కులమేల? తపమె కారణము. కాకమువల్ల, ఘనమైన యశ్వత్థముపుట్టదా? గుల్లలో ముత్తెము జన్మింపదా! విషలత, నిర్విషము బొడసూపదా! మహానుభావు లెందుబుట్టిననేమి? చిడిపిరాళ్ళలో విలువైన వజ్రములుబుట్టవా? యీగలవలన తేనెగలుగదా! వెడగుపిల్లిమేన జవ్వాది బుట్టదా! ఉడివోని పుణ్యులెందుదయించిననేమి? పంకములోబుట్టదా పరిమళపు దామర? పొంకపుకీటములందు పట్టుబుట్టదా! శ్రీవేంకటేశు గొలిచినదాసు లెందుబుట్టిన నేమి?" అని కులము నీసడించినాఁడు.

"భగవదపచారము - భాగవతాపచారము లేక - దేవతాంతరమును గొల్వక - ఆచార్యుని బగివాయనిదే - పరమవైష్ణవము, దురహంకారము - దుఃఖము సుఖమును బొరయక - ప్రాకృతుల పొంతబోవక - దర్శనాభిమానాన ధర్మము వదలక, పరిశుద్ధి నుండేదే పరమవైష్ణవము, ఉపాయాం తరములొల్లక - భక్తి చేపట్టియెపుడు తీర్థప్రసాదేచ్ఛతోడ శ్రీవెంకటేశనిలయుండె గతియని - ప్రపత్తి గలుగుటే పరమవైష్ణవ"-మని దిట్టముగా స్థిరీకరించి కొన్నాడు "పరమ వైష్ణవాచార సంగతియే - సంధ్యా వందన" మని - కర్మమార్గముపై మమత దొలగించి కొన్నాడు. "స్వామీ ! నా శక్తిపై నాకు నమ్మకములేదు. "శక్తిగలిగితే నీసరసదేవుండగానా ?" - అని విన్నవించికొన్నాడు. "కర్మము, కర్మమని యేల మభ్యపెట్టెదవు. కర్మము - ధర్మము నీకల్పితములేగదా ! యెట్టునీకువలసిన - యేపనియైన నౌను" - అని మొండికి దిరిగినాఁడు. "నా అజ్ఞాన మెప్పుడు సహజమేగదా ! నాకు జ్ఞానము ఎట్లువచ్చు" - నని "నేను జ్ఞానియైననే నీవు రక్షింతు" - వను సిద్ధాంతమునకు దెబ్బగొట్టినాఁడు - "మనసు నీయధీనము, మాటలు నీవాడేటివి, తనువు నీవు పుట్టించిన ధనమిది. నీపంపున దీనిని మోయుచున్నాను నేను నీవుచేసిన మానిసిని, వెలినీవే, లోనీవే, వేడుకలెల్లానీవే" - యనెడు ఉన్నత శిఖరము లెక్కినాఁడు. "హరిదలచు పంచ మహాపాతకుడైనా బ్రాహ్మణోత్తము" - డనే గొప్పధైర్యము సేకరించుకొన్నాఁడు "శరణంటి, నేనిట్టి జన్మము లెల్ల చింతించ - నీనామము, భవహరమై యుండగను" - అని నిశ్చింతగా - గూరుచున్నాడు. ఇకనేమున్నది ? - భావసంగతులకు పరవశమె తొడవు". ఆపారవశ్యములో నాతనికి శ్రీనివాసు డెన్నిసారులు దర్శనమిచ్చెనో ! అన్నమయ్య గడపినది మహావేదో నామమయమైన జీవితము. పొందినది సర్వోత్తమమైన ముక్తి.

ఇతని కవిత్వమును గూర్చి - మాన్యులు శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ గారిట్లన్నారు. "అసాధారణ భావన - స్వతంత్ర మధురధార - భావములలోని - అసందిగ్ధమైన ఆర్జవము - విషయవైవిధ్యము అన్నమయ్య కవితలోని ప్రధానగుణములు".

శ్రీకృష్ణశర్మగారిలో సంయమన మెక్కువ. కాని - అన్నమయ్య విషయములో నది కొంత యెక్కువైనదేమో !" యనిపించును. వారితీర్పు నంగీకరించుచునే యీ విషయమున నాదికొంత చేర్పున్నది. తెనుఁగు పదములను జోడించుటలో దిక్కునకుఁ గుడిచేయి యన్నమయ్య. భావనా ప్రపంచములో విశృంఖలముగాఁ దిరుగాడు నన్నమాచార్యులను దిక్కన్న తేరిగూడ చూడలేదు. అతనిచేతిలో భాష మైనమువలె

వంగును. ఆకవి యొక్కొక్కభావ మొక్కొక్క నందనవనము. అన్నమయ్యలోఁ గవిత్వమును వెదకుట – సముద్రమున కేతమెత్తుట; అది సర్వాంగీణమైన చక్కెర బొమ్మ; ఎక్కడ తీపుగానుండదు ? ఇక – నాతని సంగీతము; తాళ్ళపాకవారి రచనలు– అర్థ – భావ ప్రధానములు; త్యాగరాజువలె నాద – రచనా ప్రధానములుగావు; వారి రచనలకు సంగీతమల్పమైన యుపస్కారము; ఇతర భజన కీర్తనలలో నున్నంత సంగీత వాసన గూడ తాళ్ళపాక వారిలో దొరుకుట గష్టమే. వారి జాతీయములు – నానుడులు – అనేక ప్రబంధములకు జీవనౌషధములు. ఒక్కొక్కసారి యొక్కొక్క గంధర్వుడు భూలోకమున నవతరించును. అన్నమయ్య యట్టి గంధర్వుడు. ఆజన్మలో నా గంధర్వుడు ముక్తినందెను.

—o—

# క్షేత్రయ్య పదకవిత

—బాలాంత్రపు రజనీకాంతరావు.

గురుపద్య విద్యకు ఆద్యుడు నన్నయభట్టారకుడు అయినట్లుగా తెలుగున పదకవితలో ఆద్యపట్టమునకు అర్హుడయిన ఆచార్యుడు పదకవితా పితామహుడని పేరుకెక్కిన అన్నమయ్యయే. బహుళాంధ్రోక్తిమయ ప్రపంచమును వాగనుశాసనుడైన నన్నయ వెలయింపగా. కుండలీంద్రుడయిన తిక్కనసోమయాజి తన్మహనీయ స్థితి మూలమై నిలిచినట్లుగా, పదకవితా ప్రపంచమును వెలయించినవాడు అన్నమయ్యకాగా, తన్మయనీయస్థితి మూలమై నిలిచి, నిలబెట్టిన కామయాగ సోమయాజి క్షేత్రయ్య.

అన్నమాచార్యులనాడు పదం అనేమాటను పాటకు పర్యాయపదంగానే వాడే వారు. అది శృంగారపదం కావచ్చు, అధ్యాత్మపదం కావచ్చు. అయితే, అన్నమయ్య గాని, ఆయన కుటుంబంలోని వాగ్గేయకారులైన కొడుకూ, మనుమలుగాని, తమ పదా లన్నీ వేంకటేశ్వరాంకితములుగాను, వేంకటేశ్వరుడే నాయకుడుగాను రచించడం చేత, అవి అన్నీ భగవన్నాయకములూ భగవద్గుణ కీర్తనములూ కనుక, ఆ పదము లను సంకీర్తనములని కూడా అనేవారు. అన్నమాచార్యులు సంకీర్తన లక్షణములో ఆమూలాగ్రంగా వివరించినది సంకీర్తనమునకూ పాటకూ పర్యాయపదంగా వాడిన పదముయొక్క లక్షణమునే. అయితే క్షేత్రయ్య కాలంనాటికి "శృంగార రసమయమై రాగతాళ నిబద్ధమైన రచనకు 'పదము' అను సంకేత నామము వాడుట సంగీత రసికుల సంప్రదాయమైనది" క్షేత్రయ్యగారి నాయిక ఒకామె 'పదము పాడగా వినేవో, చదరం గమే చూచేవో' అని మువ్వగోపాలుని మురిసిస్తూ అడుగుతుంది – 'ఏమనే వానతీరా' అనే పదంలో, ఇక్కడ పదం అంటే శృంగార పదమే.

పదములు శృంగార వధూ
మృదు మధుర మనోజ్ఞ వాక్య మిశ్రములైనన్
విదితార్థ గ్రామ్యోక్తులు
పదిలముగా పొంక మెరిగి పలుకగ జెల్లున్.
పురుషోక్తి సంస్కృతంబును,
తరుణీ వాక్యమున ప్రాకృతము, నీచవధూ

పరిభాష నితర భాషలు
పరగిన క్రియ నుచిత భాష పదముల జెల్లున్ -

అని అన్నమాచార్యులు తమ సంకీర్తన లక్షణంలో చెప్పినట్లుగానే తాళ్ళపాక వారి శృంగారపదాలలోను, అలాగే క్షేత్రయ్య పదాలలోనూ కూడా, శృంగారనాయికల ముద్దులొలుకు మాటలలో తేటతెల్లముగా అందరకు విన్నవెంటనే అర్థము తెలిసే (అనింద్యమయిన) గ్రామ్యోక్తులూ వాక్యాలూ కొల్లలుగా దొరకుతాయి పురుషులకు ఉదాత్తమయిన సంస్కృతమూ, స్త్రీలకు ప్రాకృతమూ, ఇతరములైన నీచ పథా పాత్రాదులకు వారివారి కుచితమైన భాషారీతులనూ వాడవలెనని రూపక లక్షణకారులు నిర్దేశించిన ప్రకారంగానే పదాలలోని పాత్రోచితభాష ఉంటుంది ఈ లక్షణం మూలాన్ని తేలే మరో ముఖ్యమైన విషయం ఏమంటే, నాటకములోని పాత్రల సంభాషణ సందర్భములే ఆ పాత్రలకుచితములైన భాషారీతులలో వారి సాత్త్వికాది భావాలను ప్రదర్శించటానికి అనువయిన గేయ రచనలు పదములు అని. అందుచేత, గేయచ్ఛందో నిబద్ధమయిన పదములోని సాహిత్యమును రాగతాళములకు అనుగుణంగా పాడడమే కాకుండా, ఆంగిక విన్యాసం ద్వారా అభినయించడం కూడా ఆవశ్యకము అని స్పష్టపడుతుంది.

పదకర్తలయిన అన్నమాచార్యులూ, క్షేత్రయ్యా, తమ సంగీత, సాహిత్య నాట్య విద్యాదక్షతతో, కామతంత్ర, కావ్య, నాటక, అలంకార శాస్త్ర వైదుష్యంతో, అపారమైన జీవితానుభవ పురస్కృతమైన కళానిర్మాణ కౌశలంతో, తామెక్కడవుంటే అక్కడ పరిపూర్ణ సరస్వతీ మూర్తులై శిష్య ప్రశిష్యులతో నిత్యము గాన, నృత్త విద్యావివాద కళా ప్రదర్శనలకు అధిష్ఠాన గురువులుగా అశేష గౌరవమర్యాదలు పొందిన అదృష్టవంతులుగా కానవస్తారు

క్షేత్రయ్య బాల్యంనాడు కృష్ణానదీ తీరంలో, ఆలయ మంటపాలలో, భక్తజన సంకీర్తన గోష్ఠులలో అన్నమాచార్యుల పదాలనూ, సిద్ధేంద్రుని నృత్యకలాపాలనూ, నారాయణ తీర్థుల యక్షగాన తరంగాలను. దేవదాసీ లొకవంకా, కూచిపూడి వారొక వంకా నృత్యగానాభినయాలద్వారా ప్రచారం చేస్తూండినప్పుడే ఆయన హృదయంలో వాగ్గేయకార, నాట్యాచార్యాంశములు మొలకెత్తి ఉంటాయి. క్షేత్రయ్య వర్తమానుడైన యువ విద్వాంసుడైన నాటికే, నారాయణతీర్థులూ, కొందరు కూచిపూడి భాగవత బృందములవారు తంజావూరుకు ఆముష్మిక సంతృప్తికోసమో, ఐహిక రాజపోషణ

కోసమో వెళ్ళినట్లు విన్నవాడై తానుకూడా క్షేత్రాటనమూ, నానారాజదర్శనమూ చేయ పూనుకొని సుమారు ౨౫ ఏళ్ల వయస్సులో ఉన్నప్పుడు స్వదేశం విడిచి పర్యటనలు చేస్తూ మనకు తెలిసినంతవరకు మొదట దర్శించిన రాజాస్థానం తంజావూరు రఘునాధ నాయకునిది. ఆ తర్వాత ఎన్ని రాజాస్థానాలకు వెళ్లాడో, ఎన్ని క్షేత్రాలు దర్శించాడో, మొవ్వ వరదయ్యల్లా మువ్వగోపాల భక్తయోగియైన క్షేత్రజ్ఞుడిగా మారి, పేరు ప్రఖ్యాతులు గడించాడు.

అన్నమాచార్యులకు తరువాత రెండు శతాబ్దాలలోను నారాయణతీర్థులు, భద్రాచల రామదాసు. క్షేత్రయ్య – ఈ ముగ్గురి చేతులలోను మన సంగీతం మూడు మార్గాలను త్రొక్కింది నారాయణ తీర్థుల కృషిలో భగవత్ సంకీర్తనం ప్రధానంగా ఆధ్యాత్మిక బోధ ఆదర్శంగా ఉంచుకొని, శృంగారాన్ని ఔపచారికం చేసుకొని, ఒక పక్క నాట్యాభినయ యుక్తములయిన యక్షగానములకు ఉపాంగమౌతూ ఇంకొక పక్క భజనపద్ధతి ప్రాచుర్యానికి దారితీసింది. రామదాసు కీర్తనలు భక్తిరస పరమావధిని సాధించి, పామర జనంకూడా భక్తిమార్గాన తరింపగల భజనగోష్ఠుల వ్యాప్తికి కారణమైనాయి. క్షేత్రయ్య మార్గం శృంగారాన్ని ప్రధానంగా స్వీకరించి. ఆధ్యాత్మ బోధ అంతర్గర్భితంగా సాగుతూ నాట్యానికీ అభినయానికీ ఎక్కువ ప్రాధాన్యాన్ని ఇచ్చింది.

సంగీత సంప్రదాయ ప్రదర్శనిలో సుబ్బరామ దీక్షితులు వ్రాసినట్లు క్షేత్రయ్య పదములలోని పల్లవి, అనుపల్లవి, చరణములతో క్రమముగా రాగవృద్ధి ఎట్లు చేయబడినదో, ఒకే రాగమందలి వివిధ పదములలోని స్వరసంచారములు గమక భేదములు, అలంకారములు, పదము యొక్క భావమునకు అనుగుణముగా రసమును పోషించుట ఎట్లుండునో, ఎన్ని భావ భేదములకు ఒక్క సంగీతానుభవము యెంత ప్రభావంతముగా నిరూపించునో వ్యక్తము కాగలదు. ఎత్తుగడ, తర్వాతినడక, స్వర సంచారములు, కూడికలు, పోకడలు, రాగము యొక్క జీవకళను పదగమనములో చిప్పిల్ల జేయుచుండును క్షేత్రయ్య రాగస్వరూప చిత్రము అతి సుందరము. మనోహరము. అదివరకెవ్వరును రాగమున కిట్టి అందమును తీర్చి దిద్దిన వారులేరు. ఇట్టి రాగ రచన చేసి, రాగమునకు రస సిద్ధిని కల్పించి, రాగము యొక్క సంపూర్ణ స్వరూపమును నిరూపించి, సంగీతములో రాగమునకు గల ఉన్నత స్థానమును నిర్ణయించి, క్షేత్రయ్య – తర్వాతి వాగ్గేయ కారులకు సంగీత వేత్తలకు మార్గదర్శకుడయినాడు.

వరదయ్య మొదట సంగీత, సాహిత్య, నాట్యాభినయాలంకారాది విద్యలను అభ్యసిస్తున్న రోజులలో తన సహపాఠియైన ఒక దేవదాసిని ప్రేమించినవాడు. ఆమె కూడ సామాన్య స్త్రీ కాదు. చక్కదనము, యౌవనము మాటలట్లుండ, క్షేత్రయ్యను పదరచన చేయుమని హెచ్చరించుచు, అతడు చెప్పే ముద్దు కవితను వ్రాయుచూ. ఆయా సందర్భములలో ఆ పదములను పాడగలుగుచు, ఆ కవితా రహస్యముల నెరిగి మెప్పింపగలది; ఆట పాటలలో నేర్పరి.

కేదారగౌళ - ఆది.

పిలువ నంపె నన్నీవేళ - ప్రేమ మీరగా నిపుడు
చెలియ మువ్వగోపాలుడు - చిత్తము రంజిల్ల నేడు...
విరిబోణిరో రమ్మని - విరుల జడను జుట్టి
పరువమయిన నాటికి - పైడి యిదే ననుచు
మరువకుమీ మాట - మన కిద్దరి కీ పూట
చెరకు విల్తుడే సాక్షి - చెలి యనిన నా సామి...
ఎమ్మెకాడు నేను - నెనసిన చిన్ననాడే
సమ్మతిగా నొకచోట - చదువుచుండగ
పమ్మిన వేడుకతో - భామ నీవు ప్రౌఢవైతే
కమ్మవిల్తుని కేళి - కలసేమన్నది నిజమై...
ఎలమావితోటలో - నింపొంద నొకనాడు
యెలమి గౌరిపూజ - సలుపుచుండగా
అల మువ్వ గోపాలు - డగు వేంకటేశుడు
కలువలశయ్యపై - గలసే మన్నది నిజమై.

'ఇంతిరో వరదునికి నీపై నెంత మోహమే' అను పదంలోను, 'తరుణిరొ నే నందాక జీవము బట్టుక తాళియుండేనమ్మా' అను పదంలోను ప్రేయసీ వరదయ్యల తొలి వలపునాటి విరహావస్థలు సూచితము లవుతున్నవి.

వీరి యీ సాహచర్యమునాటికి క్షేత్రయ్య మువ్వగోపాలునిపై పదములు చెప్పి ఉండడు. ఆనాటికింకా 'సూనశరుని పాటలు సొంపుమీర పాడుకొనుచు' ఇష్టా విలాసంగా ఉండివుంటాడు. ఆమె గోపాలస్వామి ఆలయంలో నర్తకి అయి ఉండడం చేత. వీ రప్పుడప్పుడు ఆలయంవద్ద సమాగమాలు జరుపుతూ ఉండినప్పు డొకనాడు,

ఆమె ఆతనిని గోపాలస్వామిపై పదరచన చేయకూడదో! అని ప్రబోధించి ఉండుననీ, అత డందుకని దీక్షబూని ఆనందభైరవి రాగంలో ఆదితాళంలో

శ్రీపతి సుతు బారికి నే నోపలేక నిను వేడితే
కోపాలా? మువ్వగోపాలా?
ఏపొద్దు దానింటిలోనే కాపైయుండి నీ సరస స
ల్లాపాలా మువ్వగోపాలా ?

అని మొట్ట మొదటి మువ్వగోపాల పదం - ఆ ముద్రతో రచించాడు. క్రమ క్రమంగా యీ పదరచనవల్ల కలిగిన అలౌకికానంద పారవశ్యంచేత అతని ఆంతర్యం మారి, జీవితాంతంవరకూ గోపాలాంకితంగానే పదరచన చేస్తూ వచ్చాడు.

ఇతడు దర్శించిన క్షేత్రాలు :

| క్షేత్ర స్థలము | వేలుపు పేరు | రచించిన పద సంఖ్య |
|---|---|---|
| ౧. మన్నార్గుడివద్ద నున్న మహాదేవ పట్టము, వరహూరు | శ్వేత వరాహుడు ఆది వరాహుడు | ౩ పదములు |
| ౨. చిదంబరం—ఆనాడుతిల్లై అనిపేరు. | తిల్ల గోవిందరాజస్వామి | ౨ ,, |
| ౩. కడప | వేంకటేశుడు | ౧ ,, |
| ౪. కంచి | వరదరాజస్వామి, చెవ్వంది లింగడు | ౧౩, ౬ ,, |
| ౫. వేదారణ్యమో-వేదపురియో | వేదనారాయణుడు. వేదపురి నిలయుడు | ౨ ,, |
| ౬ హేమకూటము విజయనగరం వద్ద-తుంగభద్రఒడ్డున | హేమాద్రిస్వామి విరూపాక్షుడేమో | ౧ ,, |
| ౭ యదుగిరి (మైసూరులోనిదని ఒకరు,గుల్బర్గవద్ద నున్న యాదగిరి అని మరొకరు చెప్పినారు.) | చెలువరాయడు | ౧ ,, |

| | | | |
|---|---|---|---|
| ౮. ఇనపురి-కడపజిల్లా ఇనం(బ్రోలు | ఇనపురిసామి | ౨ | పదములు |
| ౯. తిరుమల | శ్రీవెంకటేశుడు | ౪ | ,, |
| ౧౦. తిరువళ్లూరు | వీరరాఘవస్వామి | ౪ | ,, |
| ౧౧. శ్రీరంగం | శ్రీరంగేశుడు—రంగనాథుడు | ౨ | ,, |
| ౧౨. మధుర | మధురాపురీశుడు—సుందరేశుడు | ౧ | పదం |
| ౧౩. సత్యపురి—చిత్తూరుజిల్లాసత్యవీడు | వాసుదేవుడు | ౧ | ,, |
| ౧౪. పాలగిరి—కర్నూలు తాలూకా | చెన్నడు—చెన్నకేశవస్వామి | ౧ | ,, |
| ౧౫. శ్రీనాగశైలం—శ్రీశైలం | మల్లికార్జునస్వామి | ౧ | ,, |
| ౧౬. చలువ చక్కెరపురి—చక్రపురం | చలువ చక్కెరపురి నిలయుడు | ౧ | ,, |
| ౧౭. కోవళ్లూరు | కోవళ్లూరు మువ్వగోపాలుడు | ౧ | ,, |
| ౧౮. కదిరిగ్రామం (లంకలోనిదని సాంబమూర్తిగారన్నారు. రాయలసీమ లోనిది కావచ్చు) | కందదేవుడు | | |

సుమారు ౧౮ పుణ్యక్షేత్రములలో ఆయా వేల్పులను గురించి పదాలను రచించి నప్పటికీ, అన్నింటిలోనను ఆ వేల్పులకు మువ్వగోపాలునితో అభేదం పాటించాడు క్షేత్రయ్య. గోపాలభక్తుడైనా, శివకేశవాభేదం పాటించినవాడు.

తాను విజయం చేసిన రాజాస్థానాలు, తాను రచించిన మొత్తం పదముల సంఖ్య దేవగాంధారీ రాగపదంలో పేర్కొన్నాడు :

వేడుకతో నడచుకొన్న విటరాయడే...
ఏడు మూడు తరాలనుండి యెందునాగాని యెవతె
కూడుకొని మువ్వగోపాలుడు కృప గల్గినా విభుడు...
*మధుర తిరుమలేంద్రుడు* – మంచి బహుమానమొసగి
యెదుట గూర్చుండుమని యెన్నిన యిమ్మనెనే
యిదిగో రెండువేల పదము లిపు డెంచుకొమ్మనిన
చదురుమీదనే యున్న సామికి సంతోష మింతింత గాదె...
ఆశమీర తంజాపురి నెలకొన్న విజయరాఘవుని
వెలయ మనుజుల వెంబడి వేగమె పొడగాంచి

చలువ చప్పరమున నుండగ చక్కగ వేయి పదముల
పలుకరించుకోగానే - బహుమాన మిచ్చె నావేళ...
బలవంతుడై గోలకొండ పాదుషా బహుమాన మిచ్చి
తులసిమూర్తితో వాదు - తలచె నావేళ
వెలయ మువ్వగోపాలుడు - వెయ్యిన్నెనూరు పదములు
నలువది దినములలోన నన్ను గలిసి వినిపించెనే...

ఈ పదానికి రాగం యదుకుల కాంభోజి అనీ, దీనిపేరు - మేరు పదమనీ సంగీత సర్వార్థసార సంగ్రహంలో ఉన్నది. మూడవ చరణంలో గోలకొండ పాదుషా దగ్గర చెప్పినవి వెయ్యిన్నూరు అని సంగీత సంప్రదాయ ప్రదర్శినిలోని పాఠం. ఈ పదము లనుబట్టి క్షేత్రయ్య రచించిన పదముల మొత్తం సంఖ్య ४౫౦౦ కాని, ४౧౦౦ కాని అయి ఉంటుంది

వరదాంకిత పదాలు :-

క్షేత్ర దైవతాంకితములుగా క్షేత్రయ చేసిన పదాలలో కంచిలోని వరదరాజును గురించి ౧౩ పదాలు, కంచియందలి చెవంది లింగని గురించి ౨ పదాలు ఉన్నాయి. వరదరాజును చెవంది లింగడును ఒక్కడే దైవమయి ఉండవచ్చని శ్రీ విస్సా అప్పా రావుగారు అభిప్రాయపడినారు. పరమార్థంలో యిద్దరూ ఒకే దైవం కావచ్చునేమోగాని, వరదరాజు వైష్ణవార్చితుడును, చెవంది లింగడు శైవార్చితుడైన ఏ ఏకామ్రేశ్వరుడో అయి ఉందురని శివ కేశవాభేదము వ్యంగ్యముగా చాటడానికని చక్కని దయగలదా అనే పదంలో.

చక్కని దయగలదా యిది నీజాగా చెవందిలింగా
యిక్కడికి వచ్చిన దెమో హెచ్చు కంచివరదా
చెలికాడ నిను చూడవచ్చితి చెవందిలింగా
తెలిసె మా యింటికి రానిదేమో కంచివరదా...
ఎవ్వడో యీ పడకింటిలో నవ్వేది చెవందిలింగ
మువ్వగోపాలుడు గాక మరెవ్వరు కంచివరద...

చెవందిలింగా, కంచివరదా అని నాయిక ఒక్కరినే సంబోధిస్తున్నట్లు రచించా డని మా అభిప్రాయం. శివకేశవాద్వైతం నిరూపిస్తూనే, యీ పదములో 'గోత్రస్ఖలనం'

అనబడు కామశాస్త్ర లక్షణానికికూడ దృష్టాంతంగా నాయిక సంభాషణలో ఔచిత్యభంగం లేకుండా ముగ్గురు నాయకుల పేరులు సంబోధింపజేశాడు. ఇదీ, యింకా యిలాటి వెన్నో దృష్టాంతాలు క్షేత్రయ్యకు కామశాస్త్రంలోను, నాయికా నాయక మన స్తత్త్వ చిత్రణము లోను కూలంకషమైన అనుభవమూ, జ్ఞానమూ ఉన్నవని చాటుతాయి

కేదారగౌళరాగంలో వ్రాసిన పదం - పల్లవిలో.

ప్రేమ కేశవరాయ - బెదరింపు కేమాయె - అని ప్రారంభించి చిట్టచివర, మాలిమి శ్రీ నాగశైల మల్లికార్జున. మువ్వగోపాల - ఏలితివి నన్నీవేళ - మోదమలర శ్రీలోల, అని పూర్తిచేశాడు, ఈ పదంకూడ శివకేశవాద్వైత తత్త్వనిరూపకమే.

కంచిదేవళంలో క్షేత్రయ పదరచనామగ్నుడై ఉన్నప్పుడు జరిగిన ఒక అలౌకిక సంఘటన గురించి శ్రీ అనంతకృష్ణ శర్మగారు వ్రాశారు.

ఒకనాడు క్షేత్రయ్య కంచి వరదరాజుల దేవళమందు రాత్రి పూజను దర్శించాడు. రాత్రి వరదునికి శయ్యాసనమును సమర్పించి అర్చకులు, భక్తులు, అమ్మవారి విగ్రహ మును ఆమె ఆలయమునుండి వరదరాజ దేవళమునకు తీసికొని విజయం చేయించి, తలుపులువేసి వెడలిపోయిరి. ఏ మూలనో చీకటిలో కంబమునకు చేరగిలబడి కన్నులు మూసికొనియున్న యీ పదాల పిచ్చయ్య నెవ్వరును గమనింపలేదు ఇతని యాంతర దృష్టి యంతయును కేళీమందిరంలోని అమ్మ, అయ్యల అలౌకిక శృంగార రసానుభవ భావనలో లీనమైయున్నది. తెల్లవారుజామున ఇతడు యోగనిద్ర మేల్కాని కన్నులు తెరవగా మెట్లనుండి దిగివచ్చుచున్నట్లు ఒకానొక స్త్రీవ్యక్తి కనిపించెనట. వెంటనే మోహనరాగములో ఝంపతాళములో-

'మగువ తన కేళికా మందిరము వెడలెన్
వగకాడ మా కంచివరద తెల్లవారె ననుచు...
విడజారు గొజ్జంగి విరిదండ జడతోను
కడు చిక్కుబడి పెనగు కంటసరితోను
నిడుదకన్నులదేరు నిదుర మబ్బులతోను
తొడరి పదయుగమున తడబడెడు నడతోను...
సొగసి సొగయని వలపు సొలపు జూపులతోను
వగవగల ఘనసార వాసనలతోను

జిగిమించు కెమ్మోవి చిగురు కెంపులతోను
సగము కుచముల విదియ చందురులతోను
తరితీపు సేయు సమసురతి బడలికతోను
జరత పావడ చెరగు జార్పైటతోను
యిరుగడల కై దండ లిచ్చు తరుణులతోను
పరమాత్మ మువ్వగోపాల తెల్లవారె ననుచు'...

అందమైన శబ్ద సంపదతో, మనోహరమైన భావ సన్నివేశములను సంఘటించి అన్నమాచార్యుడు శృంగారపద రచనలో తొలిదారులు తీర్చినవాడు. క్షేత్రయ్య శబ్ద సంపదను, భావ సన్నివేశములను మరింత పోషించి, ఆ దారుల కిరుప్రక్కలను సుందర పుష్పితోద్యానములను నాటిన తోటమాలివంటివాడు. ఇతని పదాలన్నీకూడా నాయికా నాయకులూ సఖులూ ఆయా సన్నివేశాలలోసహజంగా సంభాషించుకొనే శైలిలో సాగిపోతాయి. పాత్రౌచిత్యంకాని, కవితా శిల్పానికి కావలసిన తీవిగాని కొరవడదు; మారుమూల అచ్చతెనుగు మాటలుగాని పాండిత్య ప్రకర్షకమైన సంస్కృత పదాలుగాని చొరపడి అర్థాన్ని అయోమయం చెయ్యవు. అతని పాత్రలు కూడా అతని సాహిత్య కళాసంస్కృతులకు అనుగుణమైన ఉన్నత సంస్కారమునుకలిగి కనిపిస్తాయి. దీర్ఘములైన సంస్కృతసమాసములను క్లిష్టములైన తత్సమ పదములను కలుపక, ఎక్కువగా వ్యవహారంలో ఉండిన తత్సమపదాలు సర్వజన సామాన్యంగా అర్థమయ్యేవి ఎన్ని కలిసినా, శిష్టుల వాడుకలో ఉండి, తననాటి కవు లాదరించిన అటువంటి జానుతెనుగునే క్షేత్రయ్య తన పదాలలో వాడినాడు.

పదాలలో క్షేత్రయ్య వాడిన లోకోక్తులు కొన్ని:—

౧. అనుకో పనేమున్నది ? - అరటాకుముల్లు సామ్యమైనందు కిప్పుడు.
౨. కలిపోసిన నుట్టివంకలు చూచే వయ్యయో.
౩. తోటకూర దొంగవలె తొలగిపోయేవాడవు.
౪. సామాడి జోగివలె పోయెనా బ్రతుకు.
౫. బావిలోని నీరు వెల్లువ పొయ్యీ్యనటవే.
౬. పదరివానికి నీకు బోయపగలవలెనే యుండెనే.
౭. నే నొకటి తలచితే దైవ మొకటి తలచినందుకు.

౮. వలపు సిగ్గెరుగదు.

౯. ఇంట గెలిచి రచ్చ గెలువవలెను.

౧౦. ఏరు గడిచితేపుట్టివానికే బొమ్మన్నమాట నిజమాయె.

౧౧. పైడిచేతికి వచ్చినదే చాలునటవే.

౧౨. చేత కాసులేదు గాని చేసైగలే.

౧౩. ఊరికి పోయిన మగడు ఉట్టిపడ్డట్టు వచ్చి.

౧౪. ఇత్తడి సొమ్ములు హెచ్చైన బంగార మౌన, చలి వడగండ్లు ముత్య మౌన.

అలంకారశాస్త్రమూ. నాట్యశాస్త్రమూ పరస్పరము అవినాభావసంబంధం కలిగి ఉంటాయి. అలంకార శాస్త్రంలో చెప్పిన నాయికా నాయక లక్షణాలకు అనుగుణంగా వేషధారణచేసి నర్తకులు పదాలను పాడుతూ ఆ యా సన్నివేశాల ననుసరించి, ఆయా హావభావ విలాసములను వాటికి నిర్దేశింపబడిన హస్త ముద్రలతోను, ముఖాద్యంగ విన్యాసములతోను అభినయించి, ప్రేక్షకులకు రసస్ఫురణ కలిగిస్తారు. కూచిపూడిలోను, తంజావూరులోను క్షేత్రయ కాలమున ఉండిన భాగవత మేళములవారు అతనివద్ద పదములను నేర్చుకొని నాట్యప్రదర్శనము లిస్తూండేవారు. నటులూ, గాయకులూ, కవి పండితాది ప్రేక్షకులూ కూడా ఆ పదాలలో భావౌన్నత్యమూ, అనుభవ గాంభీర్యమూ పరిపూర్ణంగా గ్రహింపగల్గినప్పుడే ఆనాడు సభామర్యాద లభించేది

## సంగీత రచన :

రస నిర్వహణమునకు కావలసిన అంగ నిరూపణములో సుకుమారమయిన భేదాలను కల్పించడమూ, వాటిని చిత్రించడానికి కావలసిన మాటలపొందికా, సంగీత రచనా క్షేత్రయ్యసొమ్ము. మాటలలోని భావాలకు అనుగుణమయిన రాగవిన్యాసమూ, రాగస్వరూపాన్ని పరిపూర్ణంగా స్ఫురింపజేసే మాటల కూర్పూ ఇతనికి తోడ్పడినట్లు వేరేవాగ్గేయకారునికీ సహాయపడలేదు. రాగములందు భావోద్రేకం కలిగింపగల స్వర సంగతులు తెలిసిన ప్రౌఢుడు కనుక దానికి తగిన సాహిత్యం అప్రయత్నంగా రాగ భావంలోని ఆవేశంతో కలిసి పైకి తీగలు సాగి, పూవులు పూచింది. ఆ యా రసభావాల తీవ్రతలోని వ్యత్యాసాలు, ఆ వ్యత్యాసాలకు అనుసరించిన రాగవైవిధ్య ప్రయోగ జ్ఞానమూ తెలిసిన అతని పాండిత్యం అతి నిశితమూ, అతి సుకుమారమూ. కరుణ రసంలో బాహ్యమాత్రమైన దుఃఖమూ, ఉపశమించుకోగల దుఃఖమూ, దుర్భరమైన

దుఃఖమూ, హృదయవిదారకమై బావురుమనే విలాపంతో కూడిన దుఃఖమూ, ఈ వివిధ దుఃఖావస్థలుగల పదాలకు ముఖారి, ఘంటా, నాదనామక్రియ, పున్నాగవరాళి, కాంభోజి వంటి రాగాలను, గాక కర్ణాటకకాఫి, నవరోజు వంటి రాగాలనుకూడ బహుసూక్ష్మ ప్రయోగాలతో వాడి, ఒడలు ఝల్లుమనిపించ గలిగిన మహాశిల్పి, ఇతని ప్రతి పదంలోను రాగభావం మాగడవలె పైని తెరకట్టి ఆచ్ఛాదించి ఉంటుందని విద్వాంసుల అభిప్రాయం. ఒక పదము పూర్తిగా పాడునప్పటికి దానికి జతపరచిన రాగము పూర్తిగా అన్ని గతులు ప్రసృతమవుతవి.

సుమారు ౩౦౦ క్షేత్రయ్య పదాలలో ౧౪౦ త్రిపుటతాళంలోను ౧౧౮ ఆదితాళంలోను, ౫౯ చాపులోను, ౨౪ అటతాళం, ౨౨ జంపె, ౧౩ రూపకం, ౨ మధ్యం, ౧ మిశ్ర, ౧ ఏక తాళంలోను నడిచాయి.

పదం అని క్షేత్రయ్య కాలంనుంచీ స్థిరపడిపోయిన గేయరచన ప్రధానంగా అభినయాని కోసమనీ, ఇందులో అడుగుల చిందుకు అవకాశము తక్కువనీ, లయ చూపడానికి ముంగాలితోనో పాదాల కదలికలలో లేచేటప్పుడు కూర్చుండేటప్పుడూ తగు మాత్రంగా గజ్జెలమ్రోత ఉంటుందని గ్రహించాలి. అన్ని తాళాలలోను త్రిపుట, అది, చాపు, ఈ విధమైన ప్రదర్శనకు ఎక్కువ అనువైనవి. అందుకే త్రిపుటలో ఎక్కువ పదాలున్నాయి.

రసవంతమైన సంగీత నాటకంలో అత్యంత రసశిఖరాలను అందిచ్చే నాటకీయ సంఘటనలు ఇతివృత్తముగా ఆ నాటక నాయికా నాయకులు దూతికాదులు, ససంగీతముగా సనాట్యముగా పలికే నాటక సంభాషణలే – ఈ పదాలు అని మనం గుర్తుంచుకోవాలి.

తాళ్ళపాకవారి నాడు ప్రచారంలో ఉండిన – పాడి, సామంతము, ఆబాలి, అమరసింధు, రాయగౌళ, కొండమలహరి, హిజ్జజి, గుజ్జరి, తెలుగుకాంభోజి, సాళంగం, ముఖారి, పంతు వంటి అపూర్వరాగాలు క్షేత్రయ్యనాటికి అంతరించి పోయాయి. అన్నమాచార్యులు వాడిన – అహిరి, కాంభోజి, కేదారగౌళ, ధన్యాసి, భైరవి, మధ్యమావతి, ఖారి, రామక్రియ లేక పంతువరాళి, శంకరాభరణం, సావేరి, సౌరాష్ట్ర రాగాలను క్షేత్రయ్య కూడా ప్రయోగించాడు.

దొరికిన ౩౦౦ పై చిలుకు పదాలలోను క్షేత్రయ్య సుమారు ౪౦ రాగాలను వాడినాడు. రాగానికి ఒక్కొక్క పదమే రచించిన పదాల రాగాలు వసంత భైరవి,

వరాళి, ఖండె, గౌళిపంతు, గౌరి, కేదార ఇవన్నీ ప్రాచీనరాగాలే. ఇవిగాక, మిగిలిన పదాలకు వాడిన ౩౨ రాగాలు క్షేత్రయ్య నాడు బహుళ ప్రచారంలో ఉండిన రక్తిరాగాలు నేటికీ ప్రచారంలో ఉంటున్నాయి. వీటిలో శృంగార రసానికి జీవగర్రయైన కాంభోజిలో ౩౭ పదాలు, ముఖారి, భైరవి, కళ్యాణి రాగాలలో ఒక్కొక్క రాగంలో ఇరవై రెండేసి పదాలు రచించినట్లు కనబడుతుంది; మిగిలినవి – సావేరి, తోడి, కేదారగౌళ, పంతువరాళి, ఘంటారవం, మోహన, యదుకుల కాంభోజి, బిళహరి, ఆనందభైరవి, మధ్యమావతి, శంకరాభరణం, ఆహిరి, ఉసేని, పున్నాగవరాళి, సౌరాష్ట్ర, బేగడ, నవరోజు, సైంధవి, నీలాంబరి, కన్నడ, ధన్యాసి, సురట, అఠాణ, కాపీ, అసావేరి, సారంగ, శ్రీ, మారువ, నాదనామక్రియ రాగాలు.

విరహోత్కంఠిత నాయికగాగల దాదాపు ౧౬ పదాలలో – కాంభోజి, అసావేరి, శహన, తోడి, అహిరి, భైరవి, నాదనామక్రియ, కళ్యాణి, హుసేని, కాపిరాగాలను వాడినాడు. విప్రలబ్ధనాయికగా గల ౭ పదాలలో సావేరి, ముఖారి, అఠాణ, సారంగ, గౌళిపంతు, ఘంటా రాగాలను వాడినాడు. కలహాంతరితనాయికగా గల ౧౦ పదాలలో ఘంటా, కాంభోజి, పున్నాగవరాళి, కానడ సావేరి, మారువ, గౌళిపంతు, వరాళి, వసంతభైరవి, ఖండిత నాయికాపదాలు ౧౨ లో – మోహన, పున్నాగవరాళి, సావేరి, భైరవి, ముఖారి, సైంధవి, సురటి, హుసేని, కళ్యాణి రాగాలను వాడినాడు.

స్వాధీనపతిక పదాలలో ముఖారి, దేవగాంధారి, వరాళి, మధ్యమావతి అఠాణ–

ప్రోషితపతిక పదాలలో ఆనందభైరవి, ముఖారి, యదుకుల కాంభోజి, ఆహిరి, కాంభోజి రాగాలను వాడినాడు

పదరచనలో క్షేత్రయ్య తర్వాతి వాగ్గేయకారులలో ఎందరికో మార్గదర్శియైనాడు. వారిలో ముఖ్యులు, అధ్యాత్మరామాయణ కర్త మునిపల్లె సుబ్రహ్మణ్యకవి, కార్వేటినగర వాస్తవ్యుడు, విద్యాధికారి అయిన సారంగపాణి, మూవనల్లూరిలోని సభాపతిఅయ్య పేరు తెలియని పరిమళరంగ పదకర్త, యువరంగడు మొదలైనవారు ప్రసిద్ధులు.

—o—

# త్యాగరాజు - పదములు

—నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు.

సంగీత లక్షణ గ్రంథములయిన సంగీతరత్నాకరము మొదలగు గ్రంథముల యందు ప్రత్యేకమయిన ప్రబంధ ప్రకరణమున ప్రబంధమును గూర్చి వివరింపబడి యున్నది. మనకు ప్రస్తుతం వినవచ్చు గేయములన్నియు ప్రబంధజాతికి చెందినవే

అందు ముఖ్యముగా ప్రబంధమునకు స్వరము, బిరుదము, పదము, తేనకము, పాటము, తాళము అను ఆరు అంగములు కలవని నిరూపింపబడినది. ఈ ఆరింటిలో స్వరతాళములను వివరింప బనిలేదు. నాయకుని శౌర్యధైర్యసాహసములు సంబోధన రూపములో కూర్చినది బిరుదము. తదరిన తేన అను శబ్దములతో కూర్చినది తేనకము. తక తన మొదలయిన మృదంగాది శబ్దములతో కూర్చినది పాటము. నాయకుని గుణ వర్ణనము కేవల సంబోధన మాత్రముగానే కాక సుప్తిజంతపదములతో క్రియాకారక సంబంధముతో సంపూర్ణ వాక్యముగ కూర్చబడినది పదము.

ఏతావతా అష్టపదులు, అన్నమాచార్య రచనలు, క్షేత్రయ్య రచనలు, రామదాస గేయములు, త్యాగరాజ రచనములు, ఇంకా తదితర వాగ్గేయకారుల రచనములన్నియు పదములే. సారంగపాణి పదములని, పురందరదాసు పదములని, త్యాగరాజకృతులని, దీక్షితార్ కృతులని, రామదాసుకీర్తనలని, వ్యవహరిస్తూ ఉంటారు. శాస్త్ర దృష్టితో చూస్తే ఇవిఅన్నియు పదములే. కవికుల గురువగు కాళిదాసుని మేఘ దూతంలో "మద్గో త్రాంకం విరచితపదం గేయ ముద్గాతుకామా" అని యున్నది. అలకా నగరంలో నున్న యక్షిణి తన ప్రియుడయిన యక్షుని గోత్రనామములతో పదములను కూర్చి గేయము పాడగోరినదట. కనుక స్వరతాళములతో నాయకుని గుణవర్ణనాదులు కూర్చిన గేయము పదము అనే సూచన కాళిదాసునాటికే యున్నట్లున్నది.

పదమనే వ్యవహారము రానురాను సామాన్య జనంలోకూడ ఏర్పడినది. గ్రామ్య జనంలోకూడ 'ఒక పదంపాడు' అంటూ ఉంటారు. పల్లీయులు పాడుకునే పాటలను 'పల్లెపదాలు' అంటారు. నేడు సంగీత ప్రపంచంలో సంగీతసభలలో సంగీత విద్వాంసుడు పాడే రచనలలో వర్ణము,తిల్లాన, మినహాయిస్తే తక్కిన అన్నిరచనములు

పదములే. మరేమిలేదు ప్రబంధమునకు ఇతర అవయవములయిన తేనకపాట స్వరములతోకాక రచనమంతయు పదములతోనే నిబంధింపబడినది పదము. నేడు రూఢమయిన వ్యవహారం ఒక విధంగా కొనసాగినా త్యాగయ్యపదములు, క్షేత్రయ్య కృతులు, పురందరదాసు గేయములు అని వ్యవహరిస్తే వచ్చే అనర్థమేమియులేదు కృతి అంటే చేత, గేయము అంటే పాడదగినది, పదమంటే పదభూయిష్ఠ మయినది. ఈ లక్షణములు ప్రతి రచనమందు పట్టిన కారణంచేత ఇన్నివిధాలుగానూ వ్యవహరింపవచ్చును. కాని శాస్త్రదృష్టి నవలంబిస్తే పైవి అన్నియు పదములే అనాలి. ఇట్టి పదకర్తలలో త్యాగరాజును గూర్చినది నా ప్రస్తుత వక్తవ్యాంశము.

## చరిత్ర

త్యాగరాజు తిరువారూరులో రామబ్రహ్మ దంపతులకు కనిష్ఠ పుత్రుడుగా 1767 సంవత్సరంలో జన్మించుట జరిగినది. ఆజన్మసంస్కారము గలవ్యక్తి తత్రాపి తండ్రి, తాత విద్వాంసులు. తాతగారయిన గిరిరాజకవి కొన్ని యక్షగాన ప్రబంధములు చేసినట్లు ప్రతీతి. కాని నేడు అవి మన కుపలబ్ధములుకావు. తండ్రిగారయిన రామబ్రహ్మంగారి వద్దనుంచి త్యాగయ్యగారు రామభక్తి ప్రపత్తులు పుణికి పుచ్చుకొన్నాడు. తండ్రిగారితో తిరువయ్యారు చేరుకోవటం, సంస్కృతాంధ్ర విద్యాభ్యాసము, ఉపనయనము, వేదాభ్యాసము, తంజావూరు శొంఠి వేంకటరమణయ్యగారి వద్ద సంగీత విద్యాభ్యాసము, వివాహము ఇవి అన్నియు యథాక్రమంగా యథాకాలంగా జరిగిపోయినవి. తరువాత సంగీతాన్ని గూర్చి ఎక్కువగా మథనపడుట, రామకృష్ణానంద యోగివద్ద రామనారదమంత్రాలు ఉపదేశం పొందుట, నారద ప్రత్యక్షమై స్వరార్ణవం గ్రహించుట, రామ సాక్షాత్కారము పొందుట, రాజాహ్వాన తిరస్కారము, విగ్రహప్రాప్తి, తీర్థయాత్రాగమనము, ఆపత్సన్న్యాస స్వీకారము, సిద్ధి, ఇవి చరిత్రాంశములు. మన మిప్పుడు ముచ్చటించుకొనవలసినవి ఆయన కృతులలోని భక్తిభావములు, కృతిరచనా శిల్పము, సాహిత్యభావములు మొదలగు విశేషములు.

## త్యాగరాజు సంగీత విద్వాంసుడా ?

అసలు త్యాగరాజు వట్టి పాటల మాటలు మాత్రమే వ్రాసిపెట్టితే వాటికి దాక్షిణాత్య సంగీత విద్వాంసు లెవరో అనంతరము స్వరఫణితి కూర్చిపెట్టి యుండవచ్చుననే ఊహ నేడు చాలామందిలో కనిపిస్తున్నది. వీరిలో రెండురకాల వారున్నారు.

త్యాగరాజుగారు చాల తక్కువ సంగీత ఫణితితో పాడుకొంటే వాటికి మంచి విశేష సంగీతాన్ని దాక్షిణాత్యులు కల్పించుకొని పాడుకొన్నారు అని కొందరి భావము. త్యాగరాజుగారు ఏదో అద్భుతము అనిర్వాచ్యము అయిన పద్ధతిలో పాడితే క్రమంగా ఆ పద్ధతి క్షీణించిపోయి నేటికి గాయకుల శక్త్యనుసారంగా నీరసమయినది మిగిలిన దని కొందరి భావము. ఇది ప్రధానముగా సాహిత్యం వినుటలో భక్తిశ్రద్ధలు చూపే వారి భావము. ఈ విషయాలు అవగాహన చేసుకోవాలంటే ముందు త్యాగయ్యగారు సంగీతమర్మములు తెలిసిన వ్యక్తియా? కాదా? అని విచారింపవలసి ఉంటుంది

"రజతగిరీశుడు నగజకు తెలుపు
స్వరార్ణవ మర్మములు విజయముగల
త్యాగరాజుకెరుకే విశ్వసించి తెలుసుకో
ఓ మనసా!—స్వరరాగసుధారసయుతభక్తి
స్వర్గాప వర్గమురా" (శంకరాభరణ కృతి)

అని త్యాగయ్యగారే తమ కృతిలో చెప్పియుండుటచేత ఆయనకు స్వరముల యెఱుక యుండినట్లు సంగీత జ్ఞాన సముపార్జనంలో తనకు విజయము చేకూరినట్లు మనము విశ్వసింప వలసియుండును. అంతేకాక పెక్కు కృతులలో ఆయన సంగీత శాస్త్రజ్ఞానము, సంగీత సంబంధి వివిధ భావనములు మనకు ప్రస్ఫుటంగా గోచరిస్తాయి. ఉదాహరణకు సంగీత రత్నాకరంలోని కృత్యాది శ్లోకపు నాల్గవ పాదము.

"వందే నాదతనుం తముద్ధురజగద్గీతం ముదే శంకరం"

ఇదే భావముగల త్యాగయ్యగారి కృతి

"నాదతను మనిశం శంకరం నమామిమే
మనసా శిరసా" (చిత్తరంజని కృతి)

సంగీతరత్నాకరం "నాదోపాసయా దేవా బ్రహ్మవిష్ణు మహేశ్వరాః
భవంత్యుపాసితా నూనం యస్మా దేతే తదాత్మకాః"
త్యాగయ్యగారి కృతి "నాదోపాసనచే శంకర
నారాయణ విధులు వెలసిరి ఓమనసా" బేగడ
ఇట్లే "శోభిల్లు సప్తస్వర సుందరుల భజింపుమనసా"

"ప్రాణానిల సంయోగవలన ప్రణవనాదము
సప్తస్వరములై పరగె" వంటి కృతులు

త్యాగయ్యగారి సంగీతశాస్త్ర పాండిత్యాన్ని ప్రకటిస్తాయి. ఇంకొక విశేషము పైన నుదహరించిన కృతులలో శాస్త్రవిషయము నించుక స్పృశించి స్వానుభూతిని కూడా వ్యక్తం చేస్తారాయన. ఇంకొక ముఖ్యోదాహరణము.

"నాదసుధారసం బిలను నరాకృతాయెరా మనస !
స్వరము లారునొక గంటలు వరరాగము
కోదండము – దురనయదేశ్యము త్రిగుణము
నిరతగతి శరములురా" (ఆరభి కృతి)

అని తన యుపాస్యదైవమగు రామునకు సంగీతమునకు అభేదప్రతిపత్తి కల్పించుకొన్నారు త్యాగయ్యగారు.

నాద సుధారసము (సంగీతము) నరాకృతి (రామాకృతి) జెందినది. రామ కోదండము రాగమయినది. సప్తస్వరములు దానికున్న ఏడుగంట లయినవి. రాముని త్రిగుణములు లేక కోదండమున కున్న త్రిగుణములు (మూడుత్రాళ్ళు) సంగీతమున కున్న దురనయదేశ్యమార్గము లయినవి. కోదండము నుండి వెలువడు శరములు రాగముయొక్క నిరతగమనముగా రూపొందినవి. ఇదియొక అపూర్వభావనము. "అపారే కావ్యసంసారే కవిరేవ ప్రజాపతిః".

"సొగసుగా మృదంగ తాళము జతగూర్చినిను
చొక్కజేయు ధీరుడెవ్వడో –
యతి విశ్రమ సద్భక్తి విరతి ద్రాక్షారస నవరస
యుతకృతిచే భజియించేయుక్తి" (శ్రీరంజని కృతి)

మృదంగ తాళములను జతగూర్చి ఆత్మచొక్కునట్లు గానము చేయవలెనను ఆకాంక్ష తెలుపుచు కృతి ఎట్లుండవలెనో కూడ త్యాగయ్యగారు నిర్దేశించిరి. యతివిశ్రమ యుక్తంగా సద్భక్తి భరితంగా ద్రాక్షాపాకమువలె బహిరంతస్స్ఫురద్రసంగా నవరస తుందిలంగా కృతి ఉండవలెనను ఆదర్శము త్యాగయ్యగారిది' అనే విషయాన్ని చెప్పక చెప్పుచున్నది పైకృతి. ఇట్టివే ఆయన సంగీతజ్ఞానమునకు ఎన్నో నిదర్శనము లున్నవి. గ్రంథవిస్తర భీతిచే నింతవరకే చాలును. సంగీతజ్ఞానము, కల్పన, ప్రతిభ,

భావన, అనుభూతి మొదలగు ఎన్నో విశేషములు ఆయనకు దైవదత్తములు. అవి ప్రవాహరూపములై త్యాగయ్యగారి ముఖమునుండి జాలువారినవే ఆయన పదములు -కృతులు. కాని కొంతమంది ఊహించినట్లు ఆయన కేవల మాతుకారుడుకాడు. ఆయనకు ఆ అవసరములేదు. మీదు మిక్కిలి ఉత్తమ వాగ్గేయకారుడు.

## ముత్తెపుసరుల పోహళింపు

సహజంగా త్యాగయ్యగారి కృతు లాపాతమధురములు. సాహిత్యభావము లొక్కొక చోట ఏమంత విశిష్టములుకాక సామాన్యముగనే యుండియును స్వరసాహిత్యముల ఐక్యము సామరస్యము కలిగి వినువారిని రసమార్గమున పయనింపజేయును.

ఉదా॥ "రామా నిన్నే నమ్మినాను నిజముగ సీతారామ" (హుసేని కృతి)

ఇందు మననము చేయవలసిన భావమేమున్నది? అయినను ఆ నివేదనము సహజముగానుండి నాదసుధచేత తనివి గొలుపును. ఇట్లే

"ఏల నీదయరాదు - పరాకుజేసే వేలసమయముగాదు" (అఠాణ కృతి)

ఇది పల్లవి. దీని ఎత్తుగడ రాగభావదృష్ట్యారంజకము. ఆద్యంత్యప్రాసలతో గ్రహవిరామములతో ముచ్చటగొలుపును దీని అనుపల్లవి పొసగి ముత్తెపుసరుల్ పోహళించినట్లుండును. పల్లవి కొంచెం విలంబంగానుండి అకారప్రచురంగా నుంటే అనుపల్లవి పద బాహుళ్యంతో మధ్యలయలోనున్నది. అను పల్లవి ప్రారంభంనుంచి చక్కని రాగప్రవాహంలో వచ్చి వచ్చి అనుపల్లవి అంత్య భాగము పల్లవి ఆదిభాగము రెండిటిని కలుపుటలో చక్కని శిల్పజ్ఞతకావాలి. దానికిది తార్కాణ.

"బాల! కనకమయచేల! సుజనపరి
పాల! శ్రీరమాలోల! విధృతశర
జాల! శుభద కరుణాలవాల! ఘన
నీల! నవ్యవనమాలికాభరణ! ॥ఏల నీదయరాదు॥

ఇట్లే "మారుబల్కకున్నావేమిరా" "చలమేలరా సాకేతరామా" "ఎంతవేడుకొందు రాఘవా" మొదలయిన కృతులెన్నో కృత్రిమత్వంలేక సహజమయిన ఆత్మీయతతో రామునితో ముఖాముఖిగా మాటలాడి నట్లుండి తన్మయత కలిగించును.

## వాల్మీకి రామాయణ ప్రభావము

రాముడు తన దైవము. ఆ దైవమును తనకు ముక్తి ప్రసాదింపుమని వేడుకొనుట, గుణములు వర్ణించుట మాత్రమేకాదు. త్యాగరాజ మనోహంసము రామతీర్థము ద్వారా (తీర్థమనగా రేవు) రామాయణకావ్య సరోవరమున మున్కలాడును. ఆ అనుభూతిని కృతులద్వారా మన కందించుటలో మనమును ఆ సరస్సున నీదులాడుదుము.

"అలకలల్ల లాడగగని ఆ రాముని ఎటుపొంగెనో
చెలువుమీరగను మారీచుని మదమణచే వేళ
ముని కనుసైగదెలిసి శివధనువును విరిచే సమయ
మున త్యాగరాజవినుతుని మోమున రంజిల్లు" (అలకలు)
(మధ్యామావతి కృతి)

అని తాను విశ్వామిత్రుడై పొంగిపోతారు త్యాగయ్యగారు
ఇట్లే "ఎంతనినే వర్ణింతు శబరీ భాగ్యము". (ముఖారి కృతి)

రామదర్శన లాలసయై కనులార రాముని సేవించి కమ్మని ఫలము లొసగి తనువు పులకరింప పాదములకు మ్రొక్కి పునరావృత్తి రహితమగు పదమును బొందుట తాను సాక్షాత్కరింప జేసుకొని అదృశ్యమంతయు మన కన్నుల ముందుంచును. కొన్ని తావులలో రామాయణార్థమును మనస్సున నుంచుకొని ఆ అర్థమును కొంత గంభీరముగా వెలువరించును.

"సీతాపతే నామనసున – సిద్ధాంతమని యున్నానురా
వాతాత్మజాదుల చెంతనే – వర్ణించిననీ పలుకులెల్ల
ప్రేమజూపినాపై పెద్దమనసుజేసి – నీమహిమలెల్ల నిండారజూపి
ఈమహిని భయమేటికన్నమాట – రామచంద్ర త్యాగరాజనుత"
(ఖమాస్ కృతి)

వాతాత్మజాదులచెంత ప్రేమతో పెద్దమనసుతో రాముడాడిన మాట (ఈ మహిని భయమేటికి) సిద్ధాంతమని మనసున నమ్మినారట త్యాగయ్యగారు. దీనికథ ఇది. సముద్రతీరమందు హనుమత్సుగ్రీవాదులు రాముని పరివేష్టించి యున్నారు ఆ సమయంలో విభీషణుడు రాముని శరణువేడగా సుగ్రీవాదులు కొంతమంది విభీషణుడు

రాక్షసుడు రావణుని సోదరుడును కనుక వధ్యుడని అంటారు. హనుమంతుడు మాత్రము విభీషణుని గుణము లుగ్గడిస్తాడు. అప్పుడు రాముడు పెద్దమనసుతో "సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతిచ యాచతే! అభయం సర్వభూతే భ్యో దదామ్యేతద్ వ్రతం మమ" ఒకసారి నన్ను ఆశ్రయించినవానికి సర్వభూతములనుండి అభయం ఇచ్చే వ్రతమునాది కనుక విభీషణున కభయ మిస్తాను అని రాముడు పలుకుతాడు. "ఈ మహిని భయ మేటికి" అని త్యాగయ్యగారు పాడిన పాటలో కథ అంతా ఉన్నది. కొంచెం ఆలోచన ప్రసరింప చేస్తేనేకాని పై అర్థం బాగా స్ఫురించదు. ఈ విధంగానే రామాయణ ప్రభావము త్యాగయ్యగారి కృతులలో పెక్కింటిలో కనిపిస్తుంది.

## భాగవత ప్రభావము

భాగవతమందలి ప్రహ్లాద చరిత్ర, గోపికావస్త్రాపహరణకథలు త్యాగయ్యగారిని మరీ ప్రభావితుని జేసినవి. ఆ ప్రభావ ఫలితములే 'ప్రహ్లాదభక్తి విజయము' 'నౌకా చరిత్రము' ఇవి గద్య పద్య గేయాత్మకమయిన కృతులు. నౌకా చరిత్రము భక్తి శృంగారముల మేలుకలయిక గల సంగీత నాటకప్రబంధము. దీనికి మూలము భాగవత గోపికావస్త్రాపహరణము. మూలకథ త్యాగయ్యగారి చేతిలో కొంచెం రూపం మార్చు కొన్నది కథ ఇది.

కృష్ణుడు గోపికలు కలసి ఒక సాయంసమయాన యమునా నదిలో నౌకా విహారం చేస్తారు. తొలుత గోపికలు కృష్ణైక లాలసలై వచ్చి ఆకస్మికంగా కనపడిన నౌకలో విహారం చేయుటకు సిద్ధపడతారు అది ఒక మహానందంగా సాగిపోతున్నది. ఆ సమయంలో కృష్ణుడు తమకు వశంవదుడైనాడని అది తమ సౌందర్య ప్రభావమని గోపికలకు గర్వము కలుగుతుంది. ఇంతలో గాలి, మేఘాలు, ఉరుములు, వడగండ్ల వాన ఇవన్నీ సంభవిస్తాయి. నౌక నదిలో అల్లకల్లోల మవుతుంది. నౌకకు చిల్లుపడి లోపలికి నీరు చొరబారుతుంది. కృష్ణునికూడ తీసుకొనివచ్చి ఏటిపాలు చేస్తున్నామేఅని గోపికలు వాపోవుతారు. యమునా నదిని ప్రార్థిస్తారు. తరణోపాయము దొరకలేదు. శోకిస్తూఉంటే లాభంలేదు మీ రవికలతో నౌక చిల్లులు పూడ్చండి అని చెప్తాడు కృష్ణుడు. అవికూడా యమునా ప్రవాహంలో కొట్టుకుపోతాయి. తుదకు కోకలతో పూడ్చమని ఆదేశిస్తాడు. ఎట్టకేలకు గోపికలు ఆపని చేస్తారు. వాటికి కూడ రవికలకు పట్టినగతే సంభవిస్తుంది. అప్పటికి జ్ఞానోదయమై గోపికలు రెండుచేతులు జోడించి

పైకెత్తి కృష్ణుని శరణాగతి చేస్తారు. సర్వము సుఖాంత మవుతుంది. ఈ కథను బహురసవంతంగా త్యాగయ్యగారు చిత్రించారు. ఈ ఉపజ్ఞ త్యాగయ్యగారిదే అని చాలామంది విజ్ఞులు చెప్పుదురు. ఇక "ప్రహ్లాద భక్తి విజయము".

భాగవతంలోని ప్రహ్లాదుడు సముద్రమందుత్రోసి వేయబడి తరంగాలద్వారా ఒడ్డుకు చేరతాడు. *కాని త్యాగయ్యగారి ప్రహ్లాదుడు రాక్షసులచేత నాగపాశబద్ధుడై సముద్రమందు త్రోయబడగా సముద్ర మహారాజు మహాభక్తుడు వచ్చాడని ఘన స్వాగతం ఇచ్చి గరుత్మంతుని పిలచి నాగపాశ విముక్తి కలిగించి ప్రహ్లాదుని ద్వారా భక్తి ప్రబోధము వింటాడు. తరువాత భక్తి పరవశుడయిన ప్రహ్లాదునికి శ్రీమన్నారాయణుడు సాక్షాత్కరిస్తాడు. ఆ స్థితిని దర్శించుటకు సనకాదిమునులు అచటికి వస్తారు. తరువాత సూర్యోదయ మవుతుంది. అంతటితో కథ సమాప్త మవుతుంది. త్యాగయ్యగారి ప్రహ్లాదుడు తిరిగి రాక్షసబాధలకు గురికాలేదు.*

ఈ రెండు సంగీత నాటకముల యందు త్యాగయ్యగారి ప్రతిభ, క్రాంతదర్శనము పరాకాష్ఠనందు కొన్నవి. సంగీత రత్నాకర కారుడు శార్ఙ్గదేవుడు వాగ్గేయకారకుల తారతమ్యము తెలుపుచు,

"వరోవస్తుకవి ర్వర్ణకవి ర్మధ్యమ ఉచ్యతే"

వస్తుకవి అనగా కథను చెప్పుకవి ఉత్తముడని వక్కాణించినాడు. త్యాగయ్యగారు ప్రహ్లాద భక్తివిజయ, నౌకా చరిత్రములచేత ఆ గీటురాయికి కూడా నిలబడి వాగ్గేయకారకోత్తముడైనాడు.

## భక్తి ప్రబోధము

"యా వ్యాపారవతీ రసాన్ రసయితుం కాచి త్కవీనాం నవా
యా దృష్టిః పరినిష్ఠితార్థ విషయోన్మేషాచ వైపశ్చితీ
తేద్వే అప్యవలంబ్య విశ్వ మఖిలం నిర్వర్ణయంతో వయం
శ్రాంతా నైవచ లబ్ధ మబ్ధిశయన ! త్వద్భక్తి తుల్యం సుఖం"

రస వ్యాపారము గల నూత్నకవితా దృష్టితోను అర్థ విషయోన్మేషముగల పండిత దృష్టితోను విశ్వ నిర్వర్ణనము చేసి బడలిక బడ్డానే కాని భగవన్! నీ భక్తితో సమానమయిన సుఖ మెచ్చటను నాకు దొరకలేదు.

అని ఆనందవర్ధనాచార్యుని అనుభవముతో కూడిన మాట. అట్లే భక్తి సుఖాను భూతిని బాగా అనుభవించి ఆ అనుభవసారాన్ని మన కందిస్తారు త్యాగయ్యగారు.

"నీ భక్తి భాగ్యసుధానిధి నీదేదే జన్మము
భూభారముగాని సుర భూసురులై జన్మించిన ॥నీ॥
వేదోక్తంబగు కర్మలు వెతగల్గు గతాగతమౌ
నాదాత్మక త్యాగరాజ నాథాప్రమేయ సదా ॥నీ॥
(జయమనోహరి కృతి)

భక్తి అనేది ఒక అమృత స్రవంతి. దానిలో నీదిన జన్మమే జన్మము. దేవ బ్రాహ్మణులై జన్మించినా భక్తి రసాప్లుతం కాకపోతే ఆ జన్మకు ప్రయోజనము భూభారము మాత్రమే. వేదోక్తములయిన యజ్ఞము లాచరించినా ఆ పుణ్యఫలానుభవం కాస్తా క్షీణించగానే అధఃపతనమే అని యజ్ఞాది రూపకర్మాచరణము కన్న భక్తియే ప్రయోజనకారి అంటారు దానిని తలమునకలుగా అనుభవించిన త్యాగయ్యగారు.

"అప్పరామ భక్తి ఎంతో గొప్పరా
త్రిప్పటలను దీర్చి కంటి రెప్పవలెను గాచు" (పంతువరాళి కృతి)

ఈ విధంగా భక్త్యుద్బోధము గావించును.

"చక్కని రాజమార్గముండగ – సందులదూరనేల ఓ మనసా!
చిక్కనిపాలు మీగడయుండగ – చీయను గంగాసాగరమేలే"
(ఖరహరప్రియ కృతి)

కర్మాదియోగము లీ కలికాలంలో దుష్కరములై ఇరుకు సందులవలె ఉంటాయి, భక్తి మార్గము రాజమార్గము. భక్తి చక్కెర కలిపిన చిక్కనిపాలు, తక్కినది చీయనిపించు గంగాసాగరము (మద్యము). ఇట్లు భక్తిని ఒక మంచి వస్తువుతో ఇతరమును తదితరముతో పోల్చి ఒక ఉపమతో భక్తి హృదయానికి హత్తుకొనే రీతిలో చెప్పెడి నేర్పు త్యాగయ్యగారిది.

రసములలో హాస్యమునకు గూడ చోటున్నది. త్యాగయ్యగారు భక్తి ప్రబోధము చేయుటలో ఔపమ్యంతో కొంత హాస్యాన్ని కూడ సాధిస్తారు. ఆ హాస్యంతో అసలు విషయము మనస్సులో నిలచే అవకాశ ముంటుంది.

"మనసు విషయనటుల కొసంగితే
మారాముని కృప గల్గునో ?
తన తలు పొకరి ఇంటికి దీసిపెట్టి
తా కుక్కలు దోలు రీతిగాదో" (నాటకురంజి కృతి)

రాముని కృప కావాలంటే మనస్సును విషయోప భోగముల మీదనే నిలిపితే లభించదు మనస్సు రామ ధ్యానతత్పర మయితేనే రామకృప కలుగుతుంది. మనస్సు రాముని మీద నిల్పక ఆయన అనుగ్రహం మాత్రం కావాలని కోరుకొనేవారి చంద మెట్టిదంటే తన ఇంటి తలుపు ఎత్తి ఇంకొకరి ఇంటికిపెట్టి తన ఇంటివాకిట కుక్క కావలి కూర్చున్నవారి చందమని కొంచెం హాస్యస్ఫూర్తితో చెప్పేరు. ఆయన కృతులలో నిత్యము మననము చేసుకోదగిన సూక్తులెన్నో దొరుకుతాయి.

"శాంతము లేక సౌఖ్యము లేదు"
"అనురాగములేని మనసున సుజ్ఞానము రాదు"
"మనసు స్వాధీనమైన ఆ ఘనునికి మరి మంత్ర తంత్రములేల"
"మనసు నిల్పశక్తి లేకపోతే మధురఘంట
విరుల పూజ యేమి జేయును"
"గురు (గురువు) లేక ఎటువంటి గుణికి తెలియగబోదు"
"కామినీ వేషధారికి సాధ్వీనడత లేమైన దెలుసునా"
"సమయముదెలిసి పుణ్యము లార్జించని ధనికుడుండేమి పోయేమి"
"సారమౌ కవితలువిని వెర్రివాడు సంతోషపడేమి పడకేమి"
"పదము త్యాగరాజనుతునిపై కానిది పాడేమి యేడ్చేమి"

ఇవి అన్నియు అందరికి శిరోధార్యములయిన సూక్తి ముక్తావళులు.

## భాషా పాండిత్యము

త్యాగయ్యగారు పుట్టి పెరిగినది తమిళ దేశంలోనే. త్యాగయ్యగారి నాటికి ఆ కుటుంబము తెలుగుదేశం నుంచి ద్రావిడదేశానికి వెళ్ళి రెండు తరములు గడచినవి. తాతగారయిన గిరిరాజకవి కర్నూలు జిల్లాలోని కాకర్లనుంచి తిరువారూరుకు వెళ్ళినట్లు ప్రతీతి. ఇంట మాట్లాడుకున్నది చదువుకున్నది తెలుగే కనుక ఆయన కృతులలో నూటికి నూరుపాళ్లు తెలుగు దనం నిలిచియేయున్నది. ఆయన కన్న కొంత వయోధికు డయిన శ్యామశాస్త్రి కృతులందు తెలుగుదనము పూర్తిగా కనుపింపదు. తెలుగు మరచి

పోలేదు అన్నట్లు ఉండును. త్యాగయ్యగారు తెలుగువాడు, ఆయన దేవుడు తెలుగుల దేవుడు, ఆయన పలుకు తెలుగుపలుకు. సంగీతము తెలుగుభాష, అన్యోన్య శోభాకరములు. చిత్రమేమంటే త్యాగయ్యగారి సంస్కృతముకూడ తెలుగే. వాగ్గేయ కారక మూర్తిత్రయంలో ముత్తుస్వామి దీక్షితుల రచనలన్నీ సంస్కృతమే. తెలుగులేదు. ఈ కారణంచేత దీక్షితులు సంస్కృతంలో ఉద్దండ పండితుడనియు త్యాగయ్యగారికి సంస్కృత పాండిత్యములేదనియు ఆయన సంస్కృతములో కృతులు వ్రాయలేదనియు ఇప్పటికీ అనుకొనువారున్నారు. కాని ఆయన రచించిన సంస్కృత కృతులన్నీ తెలుగు కృతులవలె ఆభాసిస్తూ ఒక చిన్న కిటుకువద్ద సంస్కృత కృతులని ఆలోచనలో తెలుస్తాయి. దీక్షితులవారి రచనలు "శ్రీ సుబ్రహ్మణ్యాయ నమస్తే'' "శ్రీ మహా గణపతి రవతుమాం'' "కమలాంబాంభజరే'' ఇట్లుండి వెంటనే సంస్కృతముగా పట్టుబడిపోవును. త్యాగయ్యగారిది గడుసెత్తు.

> "సామజవర గమన! సాధుహృత్సారసాబ్జపాల!
> కాలాతీత విఖ్యాత! సామనిగమజసుధామయ
> గానవిచక్షణ! గుణశీల! దయాలవాల! మాంపాలయ" (హిందోళ కృతి)

ఈ కృతి పాడుతుంటే తెలుగు కృతివలె వినవచ్చుటకు అభ్యంతరము లేదుకాని "మాంపాలయ" వద్ద తేలుతుంది అసలు సంగతి.

> "సుజన జీవన! రామ - సుగుణభూషణ!
> భుజగ భూషణార్చిత! బుధజనావన!
> చారునేత్ర! శ్రీకళత్ర! శ్రీరమ్యగాత్ర!
> తారయ రఘువర!" (ఖమాస్ కృతి)

ఈ కృతిలో కూడ 'తారయ' వద్ద తేలుతుంది. దీనికి తత్సమ శబ్దములనే భ్రాంతి మూలము. ఇదియొక చమత్కారము. చమత్కారు లిట్టివి చేయుదురు. ముత్తుస్వామి దీక్షితుల సంస్కృత కృతి ఒకటి ఇట్లున్నది. "వరద రాజావావా" అని. ఇది ఏమి? వావా అనియున్నది అరవ కృతియా? కాదు. వరదరాజ అవ అవ అని పదచ్ఛేదంచేస్తే సంస్కృతము. సాధారణంగా త్యాగయ్యగారి కృతులు రచన క్లేశం లేకుండా అప్రయత్నంగా జాలు వారినవని ప్రతీతి. భావావేశము కలిగినప్పుడు ముఖమెత్రవారి ఆశువుగా వచ్చేదివని అనుశ్రుతంగా వస్తున్న వినికి. అది చాలవరకు సత్యమనిపిస్తుంది. కొన్ని కృతులు పరిశీలించునప్పుడు మానసైక సాక్షిగా అట్లు

తోచును. ఎందుచేతనంటే కొన్ని కృతుల అన్వయంకోసం చూచినప్పుడు అక్కరలేని పదములు క్వాచిత్కముగా నుండును.

"శ్రీ రఘుకులమందు బుట్టి నీవు
సీతను చేకొన్నరామా" (హంసధ్వని కృతి)

ఇందు నీవు అను పదము అనావశ్యకము, అన్వయమునకు అడ్డు. అంటే నోట వచ్చిన పదమును ఆయన ఉపసంహరించునదిలేదు. ప్రయత్నించి రచనకు పూను కొంటే ముందు వెనుక లాలోచించుకుంటూ చేర్పులు మార్పులు ఉంటవి. అన్వయానికి భంగమేర్పడబోవు నప్పుడుగాని సంగీత సంబంధమయిన రక్తి ఒకప్పుడు చేరకపోయి నప్పుడుగాని వాటికోసం ఆయన ప్రయత్నించక పోయినట్లు క్వాచిత్కంగా కానవస్తుంది. అయినను గుణసన్నిపాతంలో కిరణజాలంలో చంద్రాంకమువలె అట్టివి మునిగిపోవును. ఈ పరిస్థితిలోను ప్రయత్న పూర్వకంగా చేసిన కృతులు లేకపోలేదు.

"అనుపమ గుణాంబుధి అనినిన్ను నెరనమ్మి
అనుసరించిన వాడనైతి
జనక జామాతవై జనకజా మారవై
జనక జాలము
కలలోన నీవే సకలలోక నాథ కో
కల లోకువగ నిచ్చి" (అఠాణా కృతి)

దీనిలో అర్థభేదంతో వచ్చిన అక్షరాలు పునరావృత్తం చేస్తూ యమకం చూపించారు త్యాగయ్యగారు. ఇట్టి శబ్దాలంకారములు గల కొన్ని కృతులు ప్రయత్న కృతములని చెప్పవచ్చును.

## ఆత్మనివేదనము

భక్తి శ్రవణ కీర్తన స్మరణ పాదసేవనములు, అర్చనవందన దాస్యసఖ్య ఆత్మనివేదనములు, అను పేరిట తొమ్మిది లక్షణములతో నున్నది. ఇందు కాయిక ములు కొన్ని ఆధ్యాత్మికములుకొన్ని. కాయికమయిన భక్తి ఎట్లో చేయవచ్చును. మానసిక పరిణామ పరిపాకములు కలిగిన భక్తి అరుదు. భక్తిని బహిర్వేషముతో

ప్రకటించినను వారిది నిజమగు భక్తి అని విశ్వసించుటకు వీలులేదు. అట్టి బహిరాడంబర పరులను జూచి ఆత్మగత భావమును స్వామికడ నివేదించుకుంటారు త్యాగయ్యగారు.

"తెలియలేరు రామ ! భక్తిమార్గమును
ఇలనంతట తిరుగుచుమరి కలువరించేరుగాని
వేగిలేచి నీట మునిగి బూది బూసి
వ్రేళ్ళనెంచి వెలికి శ్లాఘనీయులై" (ధేనుక కృతి)

బహిరాడంబరములు, ఆలుబిడ్డల పోషణకోసం వారిని వీరిని చేరి కల్లబొల్లి మాటలుచెప్పి నాలుగు డబ్బులు సంపాదించుట, వంటివి బొత్తిగా త్యాగయ్యగారికి పట్టనివి గిట్టనివి.

"కలిలో మాటలు నేర్చుకొని కాంతలను తనయుల
బ్రోచుటకు శిలాత్ముడై పలుక నేరనుర" (మాళవి కృతి)

అంటారు.

ఈ అధ్యవసాయం ఇంటిలో అందరికీ రుచించదు. అన్న మొదలగు కొందరు ఆయనను కొంత హింస పెడతారు అపహాస్యం చేస్తారు. మనస్సు నిర్విణ్ణమవుతుంది.

"పలుకవేమి నా దైవమా రామ
పరులు నవ్వేది న్యాయమా రామ
అలుగ కారణమేమిరా రామ నీ
వాడించినట్లాడిన నాతో
తలిదండ్రులు భక్తినొసగి రక్షించిరి
తక్కినవార లెంతో హింసించిరి" (పూర్ణచంద్రిక కృతి)

అని నివేదించుకొంటారు. ఆ హింస ఎక్కువఅయి అన్నదమ్ముల వేరు కాపురాలకు మూల మవుతుంది. ఆ వేరుకు త్యాగయ్య కారణమంటారు నలుగురు. ఆ నింద దుర్భరమవుతుంది.

"నాదుపై పలికేరు నరులు
వేదసన్నుత ! భవము వేరు జేసితిననుచు" (మధ్యామావతి కృతి)

ఈ విధంగా జీవితములోని సంఘటనల వలన కలిగిన ఖేదామోదములను రామునితోనె తెలుపుకుంటూ రామైక జీవనంచేసిన వ్యక్తి. బహుశః ఆయన జీవితాన్ని గూర్చి చెప్పాలంటే ప్రధానమైనదే అది. అయితే ఆయన ఆ రామమయ జీవనమే ఇంకొక విధంగా కొనసాగిస్తే మనకు మిగిలేదేమీ ఉండకపోవును. రామభక్తిమార్గ ప్రయాణంలో పాథేయంగా సంగీత సాహిత్యాలు తీసుకొన్నారు కనుక ఆ సుధారసం ప్రవహిస్తూ నేటికి జనానీకంలో భుక్తి ముక్తిదాయక మయినది.

## ని గ మ న ము

స్వరార్ణవము అనే గ్రంథము నారదానుగ్రహంవల్ల లభించినదని ప్రతీతి. ఆ గ్రంథం ఇప్పుడు ఎచ్చటను కనిపించుటలేదు. అయితే నిరంతర తపనవల్ల త్యాగయ్యగారికి స్వరార్ణవం దొరికినది. ఎవరి అనుగ్రహములేనిదే ఇంతటి మహత్తర కార్య్య జరుగదు. ఆ దివ్యానుగ్రహమే నారదప్రసాదము రాగరత్నములు దొరికినవి. వాటితో పరశ్శతములయిన మాలికలు కూర్చి రాముని రంజిల్ల చేసినారు. ఈ రత్నము లలో ఘనరాగ పంచరత్నములు చాలా విలువగలవి. (పంచరత్నములు అయిదు కృతులు) వాటిని గురించి వ్రాయుట కన్న పాడుకొనుటలో వినుటలో వాటి సౌందర్య గాంభీర్యాదులు అవగతం అవుతాయి. అవి ఒక ప్రత్యేక పద్ధతి నవలంబించి సప్ర యత్నంగా శాస్త్రదృష్టితో రచించినవి. చతుర్దండి ప్రకాశిక, సంగీతరత్నాకరంలోని ప్రబంధ ప్రకరణం సవిమర్శంగా చూస్తే త్యాగరాజ పంచరత్నాలకు లక్షణాలు అందులో కనిపిస్తాయి. ఆ లక్షణగ్రంధాలలో చెప్పిన ప్రకారంగా పద్ధతీఛందస్సు తోటకము, మొదలయిన వృత్తాలలో పదప్రబంధము చేయవచ్చును. దానికి ఉదాహరణ ముగా త్యాగరాజ కృతులేన్నో కలవు. కాని పాడినప్పుడు ఆ కృతులు ఆ ఛందస్సు లను అనుసరించినట్లు వినపడవు. కృతిసాహిత్యాన్ని విడిగా ఆలోచనతో చూస్తే తెలుస్తుంది.

"గిరిరాజసుతా తనయా సదయా
సురనాథముఖార్చితపాదయుగా
పరి పాలయమా మిభరాజముఖా" బంగాళ కృతి

ఇది తోటకవృత్తము. ఇట్లు కొన్నికలవు.

తోటకలక్షణము : "సరసంబయి సాసన సంభృతమై
విరచించిన తోటకవృత్తమగున్" (అప్పకవి)

పద్ధడీచ్ఛందస్సు : షోడశ మాత్రాః పాదే పాదే
యత్ర భవన్తి నిరస్తవివాదే
పద్ధడికా జగణేన వియుక్తా
చరమ గురుః సా సద్భిరిహోక్తా" (ఛందశ్శాస్త్రము)

పాదమునకు పదునారు మాత్రలు, జగణము లేకుండుట, పాదాంత్యాక్షరము గురువు. ఇది పద్ధడీ లక్షణము. దీనిలో త్యాగయ్యగారి పదము లెన్నో కనిపించును.

"నిరవధి సుఖదా! నిర్మలరూపా!
నిర్జితముని శాపా ; (రవిచంద్రిక కృతి)

"ఇలలో ప్రణతార్తి హరుడ నుచుపే
రెవరిడిరే శంకరుడని నీకు
తలచి కరగి చిరకాలము పదముల
దండమిడిన నా యెడదయలేదా" (అఠాణ కృతి)

"వాదేరా; దైవము మనసా
ఆడిన మాటలు తప్పడనుచు దా
నాచంద్రార్కముగ కీర్తి గల్గిన" (పంతువరాళి కృతి)

ఇట్లెన్నో పద్ధడిలో నడచును. అష్టపదులలో పద్ధడీ ఛందస్సు విరివిగా కానవగును.

"రాసే హరిమిహ విహితవిలాసం
స్మరతి మనోమమ కృతపరిహాసం" (జయదేవ).

ఏల లనగా పదములే. ఏలా లక్షణములు వివరిస్తూ వేంకటమఖి తన చతుర్దండి ప్రకాశికలో, 'ఆంధ్ర ఏలను' ఈవిధంగా ఉగ్గడించాడు.

"నానా ప్రయోగరాగాంశ రసభావోత్కటా ఆంధ్రికా"
(ప్రబంధ ప్రకరణం 464వ శ్లోకం)

వేంకటమఖి తక్కినదే శైలకు అంకితమిచ్చిన ప్రౌఢి [illegible] ఆయన మాట బోటు కాకుండ త్యాగయ్యగారు నానాప్రయోగ రాగాల సంచారాలతో [illegible] అయిన పదము లెన్నో రచించి మనకిచ్చి కృతజ్ఞరా [illegible] నా కృతజ్ఞతా చిహ్నముగా ఈ శ్లోకప్రసూనాన్ని సమర్పిస్తున్నాను

సత్సు వాగ్గేయకారేషు పరమేష్వప్యనేకశః
రసభావాది సామ్రాజ్యే త్యాగరాజో విశిష్యతే

—o—

# కంచర్ల గోపన్న

## (1620-1680)

—శ్రీ నూకల చినసత్యనారాయణ.

'భద్రాచల రామదాసు' గా బహుళ ప్రఖ్యాతి చెందిన కంచెర్లగోపన్న పూర్వ వాగ్గేయ కారులలో ప్రసిద్ధుడు; అగ్రగణ్యుడు.

వాగ్గేయ కారుడనగా వాక్కును గేయాన్ని ఒకేసారి ఊహించి (Simultaneous) (Spontanious)గా సద్యస్స్ఫూరితో రచించగలిగినవాడు.

సంగీత సాహిత్యాల్లో నిష్ణాతుడై, (చాల అరుదు) సహజ కవిత్వధోరణి, కల్పనాచాతుర్యం ఉంటేనేగాని వాగ్గేయకారుడుగా కాలేడు.

ఉత్తమ వాగ్గేయకారుడు, భక్తుడు, జ్ఞాని అయి ఉంటే వారిరచనలు ఆచంద్ర తారార్కంగా ప్రకాశిస్తాయి. ఒకప్పుడు వారిరచనలు సాహిత్య సంగీత దృష్ట్యా ఉదాత్తంగా లేకపోవచ్చు.

ప్రస్తుతకాలం, పూర్వకాలంకంటె సంగీతసాహిత్యాల భావసంపద ఒకవిధంగా పురోగమించింది. సంగీతంలో సూక్ష్మమై, నవీనమైన, గమకాలు మార్గాలు అభివృద్ధి చెందినవి. అలాగే భావకవిత్వంలో, గేయరచనలో మంచికవులు ఉద్భవించారు కవులు గాని గాయకులుగాని మేధావులు, ప్రతిభావంతులుగా ప్రభాసిస్తున్నారుగాని వారిప్రవృత్తి, జీవనం, జ్ఞానమార్గంలో, వైరాగ్యంలో ఎంతమందికి ఉన్నది ? అనేది వివాదాంశం. గాయకుడు అద్భుతంగాపాడి శ్రోతలహృదయాలను భక్తిభావంతో పులకింపచేసి ఆర్థికంగా లాభాన్నిపొంది ఐహికసుఖాల్ని అర్థాన్ని, పోగుచేసుకుంటూ భగవంతుడు తనకు ప్రసాదించిన వరాన్ని విక్రయించి ఇహసౌఖ్యాల్ని కొనుక్కుంటాడు. "నిధిచాల సుఖమా రాముని సన్నిధిసుఖమా" అని పాడి శ్రోతలలో భక్తిభావాన్ని కలుగచేసి తామమాత్రం ఒక్కరూపాయి తక్కువైతే అంగీకరించడు.

ఈనాడు హృదయంగమంగా, భగవద్భక్తి కీర్తనలను అనేకంగా వ్రాసిన మహాప్రతిభావంతోడైన కవి ఎప్పుడు దేవాలయానికే వెళ్ళడు. దేవునిమీద తన

హృదయంలో నమ్మకమే ఉండదు మంచి మంచి భక్తి కీర్తనలు [illegible] అర్థం ఇచ్చే సౌఖ్యాల్ని, అనుభవిస్తూ ఉంటారు.

ఒకప్పుడు కాకపోతే ఒకప్పుడైనా [illegible] రించిన కీర్తనలను విని భక్తుడిగా [illegible] జ్ఞుడు ఆ గేయరచయిత, ఎప్పుడు భక్తుడు [illegible]

వృత్తి, ప్రవృత్తి ఒక్కటే అయి, [illegible] ఒక్కమాట నుడివినా ఒక్కచిన్నపాట పాడినా, [illegible] మానవుల హృదయాల్లో ప్రకాశిస్తూ ఉంటాయి

రామదాసుని రచనలు సంగీత సాహిత్యాభిజ్ఞ్యా [illegible] రామదాసు మంచి సంగీత విద్వాంసుడు, ప్రతిభ [illegible] అని తోచవచ్చు – విమర్శకులకు

వారికీర్తనలలో కవితా శిల్పంకన్న ఆర్తి, భక్తిభావం [illegible] రాగచమత్కారాలు, క్లిష్టసంగతులకన్న, సహజమైన, [illegible] సహితం పాడుకొనుటకు వీలుగా ఉన్నాయి.

నిజజీవితంలో భక్తిని, వైరాగ్యాన్ని ఆరాధించిన వాగ్గేయకారుడు [illegible] భక్తియే తనకు భుక్తి, వైరాగ్యమే తన [illegible]

రామదాసు జన్మాంతర సుకృతంవల్ల భక్తుడుగా [illegible]

రామదాసు తన రచనలు భక్త్యావేశంతో [illegible] కొన్నవిగాని, ప్రజలు, ప్రపంచం, [illegible] వారికి ఉండి ఉండదు.

కలం కాగితం తీసుకొని, రాగతాళాలు [illegible] మార్పులు చేర్పులుచేస్తూ రచనలను కొనసాగించి [illegible] కొంటూ ఉంటే తననోట రామసంకీర్తనలు వెలిసేయి.

రామదాసు త్యాగరాజునకు పూర్వుండు. క్రీ. శ. 162[illegible]–168[illegible] మ. కాలంలో గోలకొండ రాజ్యంలో అబ్దుల్లా తానాషా అబుల్ తానాషాలు [illegible]

జీవించాడు. మహాభక్తుడూ, విరాగి అయిన కబీరుదాసు శిష్యుడు. నారాయణతీర్థులకు, సిద్ధేంద్రయోగికి, క్షేత్రయ్యకు సమకాలికుడు.

భద్రగిరిపై సీతారామలక్ష్మణుల విగ్రహాలు రామదాసు కాలంనాటికి పూర్వమే, పూజా, పునస్కారాలు లేకుండా ఉన్నాయి. తమ్మల దమ్మక్క అనే వృద్ధురాలు స్వప్న దర్శనంద్వారా ఆదేవుని దర్శించి, పూజాదులు ఏర్పరచింది. ఇది కంచర్లగోపన్న భద్రగిరికి తహసీల్‌దారుగా రాకపూర్వమే జరిగింది.

భద్రగిరిక్షేత్రం బహుప్రాచీనమైనది. ఈ క్షేత్రంగురించి బ్రహ్మాండ పురాణంలో ఉంది.

కంచెర్లగోపన్న నేలకొండపల్లెలో లింగనమంత్రికీ కామమ్మకు పుత్రుడై జనించి, 1650 ప్రాంతంలో భద్రాచలానికి తహసీల్దారుగా వచ్చేముందు శ్రీరామునిచేత తమ్మక్కవలెనే ప్రబోధితుడైనాడు

కంచెర్లగోపన్నకు అక్కన్న మాదన్న లను ఇద్దరు మేనమామలు కలరు. వీరు తానాషా కొలువులో ఉన్నతాధికారులుగా ఉండేవారు. వారి సహాయంతోనే గోపన్న భద్రాచలానికి తహసీల్దారుగా నియమింపబడ్డాడు.

కంచర్లగోపన్న బాల్యంలో బాలరామాయణం మొదలైనవి పఠించిననాడే రామ భక్తి ఇతని హృదయంలో హత్తుకొని సుస్థిరవాసం ఏర్పరచుకొన్నది. బాల్యంలోనే కీర్తనలు రచించటం పాడటం మొదలుపెట్టి "ఏలా పుట్టకపోతి నాడే రాములతోడ" అని కీర్తనరూపంలో వాపోయారు.

గోపన్న నూరుకుపైగా కీర్తనలు, 'దాశరధీ శతకం,' రచించుటయేకాక ఇంకా కొన్ని కావ్యాలు వ్రాశారనటానికి ఆధారాలు ఉన్నాయి.

తన భక్తి, వేదాంతకీర్తనలతో యావద్భారతదేశాన్ని ఉర్రూతలూగించిన కబీర్‌దాసు గోపన్నకు శ్రీరామమంత్రం ఉపదేశం చేశారట. వెంటనే గోపన్న "తారక మంత్రము కోరిన దొరికెను ధన్యుడనైతిని" అనే కీర్తన ధన్యాసిరాగంలో ఆదితాళంలో రచించారు.

రామదాసుని పుత్రునికి ఒక సమయంలో ప్రమాదం జరిగి బాలుడు చావుబ్రతు కుల్లో ఉన్నప్పుడు .

"ఎంతపని చేసితివిరామా నిన్నేమనందును సార్వభౌమా
చిన్నెలన్నియు దరిగియున్న ఈచిన్నన్నగ్రన్ననను
చూడుమాయన్న ఓరామన్నా"

అని ఆవేశంతో పాడగా శ్రీరామానుగ్రహంవలన కుమారుడు నిద్రనుండి మేల్కొనినట్లు, స్వస్థతచెందెనట.

గోపన్న తహసీల్దారుగా ఉండగా తాను వసూలుచేసిన శిస్తుపైకం సర్కారువారికి కట్టకుండ భద్రగిరి శ్రీరామాలయ పునర్నిర్మాణానికి, గోపురప్రాకారములకు, శ్రీసీతా రామ లక్ష్మణుల విగ్రహములకు, ఆభరణములకు, నిత్యోత్సవములకు వెచ్చించి, రాజ ధనాపహరణ నేరమునకై కారాగృహమున బంధితుడై, పన్నెండుసంవత్సరములు ఎన్నోహింసలకు గురియై ఉండుసమయమునందు శ్రీరామచంద్రుని వేడుకొనుచూ అనేక కీర్తనలను రచించి పాడుకొనెను.

రామదాసు, వారి రచనలో బహుళంగా ఆనందభైరవి రాగాన్ని ఉపయోగించారు.

మొదటినుండి ఆనందభైరవి ఆంధ్రులసొమ్ము. ఈ ఆనందభైరవి పూర్వం ఆంధ్రభైరవిగా ఉదయించి ఇప్పుడు ఆనందభైరవిగా ప్రకాశిస్తోంది.

## కొన్ని ఆనందభైరవిలోని కీర్తనలు.

1. పలుకే బంగారమాయెనా కోదండపాణి.
2. ఎటుపోతివో రామ.
3. రామునివారము మాకేమి విచారము.
4. కలియుగ వైకుంఠము భద్రాచలనిలయము
5. ఎందుకు కృపరాదు శ్రీరాములు.
6. రామనామమే జీవనము.
7. రామనీచేతేమికాదుగా.
8. కోదండ రామ కోదండరామ

పూర్వ ప్రసిద్ధరాగాలైన, ధన్యాసి, వరాళి. నాదనామక్రియ, ఆహిరి, సౌరాష్ట్ర, యదుకుల-కాంభోజి, కాంభోజి, సైంధవి, సుకటి, మొదలైనరాగాల్లోనూ, రాగాంగరాగాలైన, శంకరాభరణం, కళ్యాణి, పంతువరాళి, తోడి, మొదలైన రాగాల్లోనూ, భాషాంగరాగాలైన, షన్నాగవరాళి, బిలహరి, ముఖారి, అసావేరి, నీలాంబరి రాగాల్లోనూ, కాపీ, కమాసు, దర్బారు, కానడ, మొదలైన ఔత్తరాహిక రాగాల్లోనూ, రామదాసు తన కీర్తనలను రచించారు.

తేట తెల్లమైన తెనుగులోనే కాక రామదాసు సంస్కృతంలోకూడా చాలా రచనలు చేసారు. వీటిలో కొన్ని అంత్యప్రాసలు కరిగి చాలా హృద్యంగా ఉన్నాయి.

1. భజరే శ్రీరామం — నవరోజు - ఆది.
2. భజరే మానసరామం — నవరోజు - ఆట.
3. వందే విష్ణుం దేవ మశేషస్థితిహేతుం — రేగుప్తి - రూపకతాళం
4. కుండల రుచిరం లలితకపోలం, — సావేరి - ఆట.
5, దీనదయాళో, దీనదయాళో — యమునా కల్యాణి-చాపు.
6. పతిరేవ గతిరధునా శ్రీ సీతాపతిరేవ గతిరధునా — పంతువరాళి-చాపు.

రామదాస కీర్తనలలో చాలా ప్రసిద్ధి గాంచిన కొన్ని కీర్తనలు

1. తారక మంత్రము కోరిన దొరికెను.
2. తక్కువేమి మనకు రాముండొక్కడుండువరకు
3. ఏ తీరుగనను దయచూచెదవూ
4. గరుడ గమనరారా
5. ఏడనున్నాడో భద్రాదివాసుండు
6. ఏమిరా రామ నావల్లదోషము
7. చరణములే నమ్మితి నీదివ్య
8. పాహిమాం శ్రీరామాయంటే పలుకవైతివి.

9. ఇక్ష్వాకు కుల తిలక ఇకనైన పలుకవే

10. నను బ్రోవమని చెప్పవే.

11. అంతా రామమయం ఈజగమంతా – రామమయం.

రామదాసు వారి కీర్తనలలో వాడిన తాళాలు, ఆది, చాపు, రూపకం, అట, ఏక, ఝంప, త్రిపుట మొదలైనవి.

రామదాసు కీర్తనలు, ఆదరణ సౌలభ్యం, భావ సౌన్దర్యం, భక్తి భావము కలిగి ఉన్నాయి.

భద్రాచల రామదాసు కీర్తనలు ఇంచుమించు వంద ఉన్నాయి. కాని రామదాసు కీర్తనలుగా చలామణీ అవుతోన్న కొన్ని కీర్తనలు. "రామదాస చరిత్ర"లో కథా కథనంకోసం, యాదవదాసు, సింగరిదాసు, తూము నరసింహదాసు, పెద్ద రామదాసు రచించిన కీర్తనలు చొప్పించబడ్డాయి.

రామదాసు నాటికి కర్ణాటక సంగీతం అంతగా అభివృద్ధి చెందలేదు. సంగీత త్రిమూర్తులైన త్యాగరాజు, శ్యామశాస్త్రి, దీక్షితర్ ప్రభృతులు కర్ణాటక సంగీతంలో యుగ కర్తలు. వీరితో కర్ణాటక సంగీతానికి స్వర్ణయుగం ప్రారంభం అయింది.

వీరిలో ముఖ్యులైన శ్రీత్యాగరాజు మహా వాగ్గేయకారుడు. భక్తశిఖామణి. కర్ణాటక సంగీత స్వర్ణయుగకర్త. శ్రీ త్యాగరాజు తన బాల్యంలో అంటే తన కీర్తనలను ప్రారంభించక పూర్వం, విద్యార్థి దశలో రామదాసు కీర్తనలు భక్తితో పాడుకొనేవారు.

ఆ నాటికే రామదాసు కీర్తనలు. ఆంధ్ర, తమిళ, కన్నడ, కేరళ రాష్ట్రాల్లో బహుళ ప్రచారాన్ని పొందాయి.

త్యాగరాజునకు రామదాసు భక్తిలోనూ, వాగ్గేయ రచనలోనూ ఆదర్శ ప్రాయుడు.

త్యాగరాజు "క్షీరసాగర శయన" అనే తన దేవగాంధారి కీర్తనలో "ధీర రామదాసుని బంధము తీర్చినది విన్నానురా" అని పాడి రామదాసుపై తనకుగల భక్తి గౌరవాలను వ్యక్తపరిచాడు.

రామదాస కీర్తనలు, త్యాగరాజ కీర్తనల వలె, కేవల సంగీత రచనలు కాక పోవటానికి కారణాలు కొన్ని ఉన్నాయి.

మొదటిది రామదాసునాటికి సంగీతం, సంగీతరచనల స్థాయి త్యాగరాజు కాలం నాటివలె అంత అభివృద్ధి చెందలేదు. అందుచేత రామదాసుని రచనలలో సంగీతం వాహకంగానే ఉన్నది.

రామదాసు కీర్తనలు మొట్ట మొదటినుండీ భజన కూటాల్లో పాడబడుతూ భజన కీర్తనలుగానే ప్రచారం అయినవి.

సంగీతజ్ఞులు వాటిని భజనకీర్తనలుగానే పరిగణించారు; కాని కేవల సంగీత రచనలుగ (Pure Art forms) వాటి అర్హతను పరిశీలించి, వాటియందు పరిపుష్టి అయిన సంగీతాన్ని చొప్పించి (Pure forms) కేవల సంగీతరచనలుగ రూపొందించే కృషిచేయక పోవడం జరిగింది.

ఒకవిధంగా చూస్తే సంగీతవిద్వాంసుల ఉదాసీనత రామదాసు కీర్తనలకు సంగీత విద్వాంసులు కానివారికి, (ప్రజలలో సంగీతవిద్వాంసుల సంఖ్య చాలాచాలా స్వల్పం) ఉపకారమే జరిగిందేమో. వాటినిగాని సంగీతరచనలుచేసి విద్వాంసులు పాడితే ప్రజలకు అందుబాటులో ఉండకపోయేవేమో కనుక బహుజనప్రయోజనార్థం రామదాసు కీర్తనలు భజనకీర్తనలుగా ఉండటమే సముచితం.

రామదాసు కాలంలో కీర్తనకు అనుపల్లవి అనే భాగం ఉండేదికాదు. పల్లవి, కొన్ని సమిష్టిచరణాలు ఉండేవి.

రామదాసుని కొన్నికీర్తనలు అనుపల్లవులు కలిగి ఉన్నాయి అనేవిషయం పరిశీలిస్తే తెలుస్తుంది.

పల్లవి, కొన్నిచరణాలు కలిగినరచనను కీర్తన అని, పల్లవి, అనుపల్లవి, చరణము కలిగిన కీర్తనను కృతిఅని ఈమధ్య లాక్షణికులు విభజించారు.

త్యాగరాజే 'కృతి' అనే సంగీతరచనకు (అనుపల్లవి కలిగిన సంగీతరచనకు) స్రష్ట అని వాడుక. కాని రామదాసే అనుపల్లవి అనేభాగాన్ని ఊహించి సృష్టించాడు అనునది యదార్థం. ఈ విషయంగా కూడా రామదాసు త్యాగరాజునకు ఆదర్శప్రాయుడు. ఉదా : 1. ఏమయ్యరామ : కాంభోజి. 2. ఎన్నగాను రామభజన : కామవర్ధని.